https://epaper.dksaardyamlochaatimpu.com




E-mail: dkchaatimpu80@gmail.com RNI. NO. APTEL/2008/26737

# డీకే సారథ్యంలో చాటింపు

తెలంగాణ దిన పత్రిక

హైదరాబాద్ | సంపుటి : 17 సంచిక : 307 | ఎడిటర్ : పూసాల శ్రీనివాస్ | మంగళవారం, సెప్టెంబర్,8, 2026 | పేజీలు : 8 వెల : రూ.1/-

## తెలంగాణ అసెంబ్లీ గేటు వద్ద తోపులాట..

# కేటీఆర్ నుదుటికి, చేతికి గాయం!



**హైదరాబాద్,సెప్టెంబర్,07**తెలంగాణ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బీఆర్ఎస్ చేపట్టిన నిరసన ఉద్రిక్తతకు దారితీసింది. నల్ల టీషర్టులు ధరించి అసెంబ్లీకి వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు గేటు వద్ద అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ప్రభుత్వ హామీల అమలును డిమాండ్ చేస్తూ.. బీఆర్ఎస్ నేతలు నినాదాలు చేస్తూ అసెంబ్లీలోకి వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. బీఆర్ఎస్ నేతలు స్లోగన్లతో కూడిన నల్ల టీషర్టులు ధరించి రావడంతో.. స్పీకర్ ఆదేశాల మేరకు అసెంబ్లీ లోపలికి అనుమతించలేమని పోలీసులు స్పష్టం చేశారు. టీషర్టులు తొలగించి సభలోకి వెళ్లాలని పోలీసులు కోరినప్పటికీ.. బీఆర్ఎస్ నేతలు నిరసన కొనసాగిస్తూ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో అసెంబ్లీ గేటు వద్ద పోలీసులు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితి అదుపు తప్పడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. ఈ ఘటనలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు నుదుటిపై, చేతికి గాయాలైయ్యాయి. మరోవైపు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి కాలికి కూడా గాయం అయింది. తోపులాట అనంతరం పోలీసులు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు చేసిన వారిని అసెంబ్లీ గేటు వద్ద నుంచి తెలంగాణ భవన్‌కు తరలించారు. ప్రస్తుతం కేటీఆర్, హరీశ్‌రావు, ఇతర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తెలంగాణ భవన్‌లో ఉన్నారు. మరోవైపు ఈ ఘటనపై బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ గేటు వద్ద తమతో వ్యవహరించిన తీరు అవమానకరంగా ఉందని ఆరోపించారు. తమ పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే ఈ విషయాన్ని స్పీకర్ దృష్టికి తీసుకెళ్లి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. మరోవైపు పోలీసులు మాత్రం తాము స్పీకర్ ఆదేశాలను అమలు చేశామని చెప్పారు. నల్ల టీషర్టులతో అసెంబ్లీలోకి నుమతించకూడదని ఆదేశాలు ఉండటంతో.. టీషర్టులు మార్చుకుని సభకు వెళ్లాలని సూచించామని, కానీ బీఆర్ఎస్ నేతలు నిరసనకు దిగడంతో వారిని అరెస్ట్ చేసి తెలంగాణ భవన్‌కు తరలించామని డీసీపీ శిల్పవల్లి వివరించారు. అసెంబ్లీ సమావేశాల ప్రారంభ దశలోనే అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య ఘర్షణ వాతావరణం నెలకొనడం చర్చనీయాంశంగా మారింది.

## అసెంబ్లీలో ఊహించని పరిణామం..

# కంటతడి పెట్టిన స్పీకర్ ప్రసాద్ కుమార్

**- తాతా మధు వ్యాఖ్యలపై సభలో తీవ్ర చర్చ- తాతా మధును డిస్మిస్ చేయాలని సీఎం డిమాండ్ -వ్యాఖ్యలను ఖండించిన బీజేపీ నేత మహేశ్వర్ రెడ్డి-స్పీకర్ తల్లి ప్రస్తావనపై సీతక్క ఆవేదన**



**హైదరాబాద్,సెప్టెంబర్,07:**తెలంగాణ అసెంబ్లీలో సోమవారం అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. సభా కార్యకలాపాలు కొనసాగుతున్న సమయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తీవ్ర భావోద్వేగానికి గురై కంటతడి పెట్టారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు స్పీకర్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసినట్టు ఆరోపణలు రాగా, దీనిపై సభలో చర్చ జరుగుతున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఉదయం అసెంబ్లీ వెలుపల తాతా మధు చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఈ వ్యవహారంపై సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురు మంత్రులు సభలో తీవ్రంగా స్పందించారు. స్పీకర్‌ను ఉద్దేశించి అభ్యంతరకరమైన భాషను ఉపయోగించడం చట్టసభల గౌరవాన్ని దెబ్బతీయడమేనని సీఎం అన్నారు. తాతా మధు శాసనమండలి సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సభాపతికి జరిగిన అవమానం సభ్య సమాజానికి జరిగిన అవమానమని రేవంత్ రెడ్డి అన్నారు. ఇలాంటి భాషను చట్టసభల్లో సహించకూడదని స్పష్టం చేశారు. బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి కూడా తాతా మధు వ్యాఖ్యలను ఖండించారు. స్పీకర్‌పై అనుచిత భాష ఉపయోగించిన సభ్యుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశంపై చర్చ జరుగుతున్న సమయంలో ప్రసాద్ కుమార్ భావోద్వేగానికి గురయ్యారు. ఛైర్‌లో ఉండగానే కన్నీళ్లు పెట్టుకున్నారు. దీంతో సభలో ఒక్కసారిగా ఉద్విగ్న వాతావరణం నెలకొంది. మంత్రి సీతక్క కూడా ఈ ఘటనపై తీవ్రంగా స్పందించారు. స్పీకర్ తల్లిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు బాధాకరం అంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేస్తూ భావోద్వేగానికి గురయ్యారు. అణగారిన వర్గాల నుంచి వచ్చిన వ్యక్తులు అత్యున్నత పదవుల్లో ఉండటాన్ని కొందరు ఓర్వలేకపోతున్నారని బీఆర్ఎస్‌పై విమర్శలు చేశారు. తాతా మధును వెంటనే సస్పెండ్ చేయాలని, ఆయన సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ క్షమాపణ చెప్పాలని కోరారు.

# ‘నా చీర లాగేశారు’..

## బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి కన్నీరు -



**హైదరాబాద్,సెప్టెంబర్,07:**తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాల తొలిరోజే తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. నల్ల దుస్తులతో అసెంబ్లీకి వచ్చిన బీఆర్ఎస్ నేతలను గేటు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో తన చీర లాగేశారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి కన్నీరు పెట్టుకున్నారు. తన కాలికి కూడా గాయమైందని చెప్పారు. ఈ ఘటనపై ఫిర్యాదు చేస్తానని తెలిపారు. బీఆర్ఎస్ నేతలు నల్ల షర్టులు, మహిళా నేతలు నల్ల చీరలు ధరించి అసెంబ్లీకి వచ్చారు. అయితే వారికి ప్రవేశం లేదంటూ సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో నేతలు అక్కడే నిరసనకు దిగారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. తన చీర లాగడం బాధ కలిగించిందని సునీతా లక్ష్మారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీలో ఉన్న మహిళలకే రక్షణ లేకపోతే బయట ఉన్న మహిళలకు వీళ్లు ఏం రక్షణ కల్పిస్తారని ప్రశ్నించారు. తన కాలికి గాయమైందని తెలిపారు. తాము అసెంబ్లీకి వస్తే ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామన్న భయంతోనే అడ్డుకుంటున్నారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ప్రజా సమస్యలపై మాట్లాడేందుకు తమకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు..

# కేసీఆర్ క్షమాపణ చెప్పాలి

## అసెంబ్లీలో సీఎం రేవంత్ డిమాండ్



**హైదరాబాద్,సెప్టెంబర్,07:** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేశారంటూ సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. తాతా మధును తక్షణమే చట్టసభ నుంచి డిస్మిస్ చేయాలని శాసనమండలి ఛైర్మన్‌ను కోరారు. ఈ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శాసనసభలో సోమవారం మాట్లాడిన రేవంత్ రెడ్డి.. సభాపతి స్థానానికి ఎంతో గౌరవం ఉందన్నారు. బీఆర్ఎస్ సభ్యులను కేసీఆర్ తన ఫామ్‌హౌస్‌కు పిలిపించి ఉసిగొల్పి పంపడం వల్లే ఆ పార్టీ నేతలు ఈ విధంగా వ్యవహరిస్తున్నారని రేవంత్ ఆరోపించారు. సభ్యుల హక్కులను కాపాడుతున్న స్పీకర్‌ను ఉద్దేశపూర్వకంగా అవమానించారని విమర్శించారు. స్పీకర్‌ను గౌరవించడం చట్టసభల కనీస సంప్రదాయమని చెప్పారు. సభాపతిపై అభ్యంతరకరమైన భాషను ఉపయోగిస్తే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు. ఇది స్పీకర్‌కు జరిగిన అవమానం మాత్రమే కాదని, సభలోని ప్రజాప్రతినిధులందరికీ జరిగిన అవమానమని అన్నారు. బీఆర్ఎస్ సభ్యులను కేసీఆర్ తన ఫామ్‌హౌస్‌కు పిలిపించి ఉసిగొల్పి పంపడం వల్లే ఆ పార్టీ నేతలు ఈ విధంగా వ్యవహరిస్తున్నారని రేవంత్ ఆరోపించారు. సభ్యుల హక్కులను కాపాడుతున్న స్పీకర్‌ను ఉద్దేశపూర్వకంగా అవమానించారని విమర్శించారు. ప్రభుత్వం కొన్ని సందర్భాల్లో సంయమనం పాటిస్తుందని, దాన్ని తమ చేతగానితనంగా భావించవద్దని హెచ్చరించారు. తన రాజకీయ జీవితంలో ఎన్నో సభలను చూశానని, చట్టసభల్లో ఇంత అభ్యంతరకరమైన భాషను ఎప్పుడూ చూడలేదని రేవంత్ అన్నారు. ఇలాంటి వైఖరిని క్షమిస్తూ పోతే ప్రజాస్వామ్య వ్యవస్థలపై ప్రజలకు ఉన్న గౌరవం దెబ్బతింటుందని హెచ్చరించారు. మరోవైపు బీజేపీపైనా సీఎం విమర్శలు చేశారు. బీఆర్ఎస్ నేతలను కాపాడేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ)లో నిర్ణయం తీసుకున్న తర్వాతే బీజేపీ లేవనెత్తిన అంశాలపై చర్చిస్తామని రేవంత్ స్పష్టం చేశారు.

# రాంచందర్‌రావు అరెస్ట్.. తోపులాట.. ఉద్రిక్తత




**హైదరాబాద్,సెప్టెంబర్,0**తెలంగాణ అసెంబ్లీ ముట్టడికి యత్నించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావును పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ క్రమంలో అక్కడ తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. హైదరాబాద్, సెప్టెంబర్ 7: తెలంగాణ అసెంబ్లీ ముట్టడికి యత్నించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావును పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ క్రమంలో అక్కడ తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈరోజు(సోమవారం) ఉదయం నుంచి దశలవారీగా అసెంబ్లీ ముట్టడికి వస్తున్న బీజేపీ శ్రేణులను పోలీసులు ఎప్పటికప్పుడు అరెస్ట్ చేస్తున్నారు. వరుసగా అసెంబ్లీ ముట్టడికి కమలం పార్టీ నేతలు రావడంతో అక్కడ గందరగోళ పరిస్థితి నెలకొంది. మరోసారి అసెంబ్లీ ముట్టడికి బీజేపీ యత్నించడంతో.. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు సహా పలువురు కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాంచందర్‌రావు అరెస్ట్ సందర్భంలో తోపులాట చోటు చేసుకుంది. దీంతో గన్‌పార్క్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. బీజేపీ తెలంగాణ చీఫ్‌ను పోలీసులు తీసుకెళ్లకుండా రోడ్డుపై పడుకుని మరీ బీజేవైఎం నేతలు నిరసనకు దిగారు. రాంచందర్ రావును తీసుకెళ్తున్న పోలీస్ వాహనంపైకి బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ కుండే ఎక్కడంతో.. వెంటనే పోలీసులు అతడిని లాగి పడేశారు. ఆ వెంటనే పలువురు కార్యకర్తలు కారుకు అడ్డంగా పడుకున్నారు. పోలీసులు వారిని చెదరగొట్టి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని అక్కడి నుంచి తీసుకెళ్లేందుకు యత్నించారు. దీంతో అసెంబ్లీ వద్ద బీజేపీ నేతలు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. ఈ క్రమంలో ఇద్దరు కార్యకర్తలకు చేతులు విరగగా, పలువురు కార్యకర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు యత్నిస్తున్నారు. వరుసగా బీజేపీ నేతల ముట్టడితో అసెంబ్లీ పరిసర ప్రాంతాల్లో హైటెన్షన్ నెలకొంది.

## ఢిల్లీలో ఘోర ప్రమాదం..

# వివాదాస్పద కమిషనర్ రాజీనామాకు డిమాండ్

**ఢిల్లీలో ఐదంతస్తుల హాస్టల్ భవనం కూలి ఏడుగురు విద్యార్థులు మృతి-అక్రమ నిర్మాణాలపై పర్యవేక్షణ వైఫల్యమంటూ తీవ్ర విమర్శలు-ఎంసీడీ కమిషనర్ సంజీవ్ ఖిర్వార్ రాజీనామా చేయాలని డిమాండ్-గతంలో కుక్క వాకింగ్ వివాదంలో చిక్కుకున్న అధికారి ఈయనే-తాజా ఘటనతో మరోసారి వార్తల్లో నిలిచిన సంజీవ్ ఖిర్వార్**



**న్యూఢిల్లీ,సెప్టెంబర్,07:**దేశ రాజధాని ఢిల్లీలో ఆదివారం మధ్యాహ్నం విషాదం చోటుచేసుకుంది. ఓ ఐదంతస్తుల హాస్టల్ భవనం కుప్పకూలిన ఘటనలో ఏడుగురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. ఈ దుర్ఘటనతో ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ) కమిషనర్, ఐఏఎస్ అధికారి సంజీవ్ ఖిర్వార్ మరోసారి తీవ్ర వివాదంలో చిక్కుకున్నారు. ఆయన తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలనే డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. ఢిల్లీ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ సమీపంలోని సత్య నికేతన్ ప్రాంతంలో ఈ ప్రమాదం సంభవించింది. అక్కడ విద్యార్థుల హాస్టల్‌గా వినియోగిస్తున్న ఐదంతస్తుల భవనం బేస్‌మెంట్‌లో మరమ్మతు పనులు జరుగుతుండగా, అది ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు భవన పునాదులు బలహీనపడటమే ఈ ప్రమాదానికి ప్రాథమిక కారణమని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటనతో నగరంలోని అక్రమ నిర్మాణాల అంశం మరోసారి చర్చనీయాంశమైంది. బహుళ అంతస్తుల భవనాల్లో భద్రతా ప్రమాణాలు పర్యవేక్షణంలో అధికారులు ఘోరంగా విఫలమయ్యారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో, ఎంసీడీ కమిషనర్‌గా ఉన్న సంజీవ్ ఖిర్వార్ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. 1994 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి సంజీవ్ ఖిర్వార్ వివాదాల్లో చిక్కుకోవడం ఇది మొదటిసారి కాదు. గతంలో 2022లో ఆయన, ఆయన భార్య రింకూ దుగ్గా (మాజీ ఐఏఎస్) ఢిల్లీలోని త్యాగరాజ్ స్టేడియంను తమ పెంపుడు కుక్క వాకింగ్ కోసం వినియోగించుకున్నారనే ఆరోపణలు వచ్చాయి. వారి కోసం అథ్లెట్లను స్టేడియం నుంచి నిర్దేశిత సమయం కంటే ముందుగానే పంపించివేయడం వివాదాస్పదమైంది. ఆ వివాదం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం వారిద్దరినీ వేర్వేరు సుదూర ప్రాంతాలకు బదిలీ చేసింది. ఖిర్వార్‌ను లడక్‌కు బదిలీ చేయగా, రింకూ దుగ్గా అనంతరం తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. అయితే, ఈ ఏడాది జనవరిలో ఖిర్వార్ తిరిగి ఢిల్లీకి చేరుకుని ఎంసీడీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. తాజాగా చోటుచేసుకున్న ఈ భవనం కూలిన ఘటనతో ఆయన పేరు మరోసారి వార్తల్లో నిలిచింది.

## ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దు..

# పోలీసులకు తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు



**హైదరాబాద్,సెప్టెంబర్,07:**తెలంగాణ శాసనసభకు వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దని రాష్ట్ర పోలీసులను హైకోర్టు సోమవారం ఆదేశించింది. శాసనసభ్యులు ఏవైనా నిబంధనలు ఉల్లంఘిస్తే ఆ వ్యవహారాన్ని స్పీకర్ చూసుకుంటారని, పోలీసులు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని న్యాయస్థానం స్పష్టం చేసింది. అసెంబ్లీ సమీపంలో సోమవారం ఉదయం చోటుచేసుకున్న పరిణామాలను పరిగణనలోకి తీసుకున్న ఉన్నత న్యాయస్థానం, ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉదంతంపై రాష్ట్ర హోం శాఖకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. విచారణలో భాగంగా, మహిళా ఎమ్మెల్యేలపై దాడికి పాల్పడ్డారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు అధికారులను గుర్తించాలని ఆదేశించింది. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర నివేదికను సమర్పించాలని డీజీపీని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఉదయం అసెంబ్లీ వద్ద జరిగిన పరిణామాల నేపథ్యంలో హైకోర్టు ఆదేశాలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# ప్రతి రైతు కుటుంబానికి స్థిరమైన ఆదాయ వనరులు కల్పించాలి...

## -అందుకు సమగ్ర ప్రణాళికలు రూపొందించాలి... -ఎక్కువ మంది రైతు కుటుంబాలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూర్చే ప్రధాన ప్రణాళికను రూపొందించాలి... -నారాయణపేట జిల్లా కలెక్టర్ ప్రియాంక... -డ్రాట్ మిటిగేషన్ కార్యక్రమంలో భాగంగా నారాయణపేట జిల్లాలో ఉట్కూర్ మండలం ఎంపిక... -డ్రాట్ మిటిగేషన్(కరువు నివారణ)పై సమావేశం...

నారాయణపేట,(డీకే చాటింపు): గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి రైతు కుటుంబానికి ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరేలా, స్థిరమైన ఆదాయ వనరులను కల్పించే విధంగా సమగ్ర ప్రణాళికలను రూపొందించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లో డ్రాట్ మిటిగేషన్(కరువు నివారణ)పై జిల్లా కలెక్టర్ ప్రియాంక అధ్యక్షతన సమావేశం జరిగింది.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో డ్రాట్ మిటిగేషన్ కార్యక్రమంలో భాగంగా నారాయణపేట జిల్లాలో ఉట్కూర్ మండలాన్ని ఎంపిక చేయగా దానిని అమలు చేసే బాధ్యతను వా సన్ సంస్థ చేపట్టగా సోమవారం కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వాసన్ సంస్థ ప్రతినిధులు డీపీఆర్ ను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా జిల్లా కలెక్టర్ కు వివరించారు.అనంతరం జిల్లా కలెక్టర్ ప్రియాంక మాట్లాడుతూ గ్రామీణ కుటుంబాల అవసరాలు, స్థానిక వనరులు,రైతుల సామర్థ్యాలను పరిగణనలోకి తీసుకుని ఒకే సమగ్ర ప్రణాళిక కింద వివిధ కార్యక్రమాలను అనుసంధానం చేయాలని సూచించారు. అందుబాటులో ఉన్న నిధులను చిన్నచిన్న కార్యక్రమాలుగా విభజించడం కంటే,ఎక్కువ మంది రైతు కుటుంబాలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరే ఒక ప్రధాన ప్రణాళికను రూపొందించి అమలు చేయాలని తెలిపారు. వ్యవసాయంతో పాటు పశుసంవర్ధక,పౌల్ట్రీ, డెయిరీ, గొర్రెలు,మేకల పెంపకం తదితర లైవ్‌స్టాక్ రంగాలను ప్రణాళికలో భాగం చేయాలని సూచించారు. ముఖ్యంగా పౌల్ట్రీ,లైవ్‌స్టాక్ రంగాల్లో ఉన్న అవకాశాలను గుర్తించి,రైతులకు అవసరమైన ఇన్‌పుట్స్,సాంకేతిక సహాయం,శిక్షణ,వెటర్నరీ సేవలు,మార్కెట్ లింకేజీ అందేలా సమగ్ర వ్యవస్థను రూపొందించాలని ఆదేశించారు.ఒక్కో చోట ఒక యూనిట్ ఏర్పాటు చేసి వదిలేయకుండా,ఉత్పత్తి నుంచి మార్కెటింగ్ వరకు పూర్తి విలువ గొలుసు అభివృద్ధి చేయాలని కలెక్టర్ సూచించారు.ఉత్పత్తికి అవసరమైన ముడి సరుకులు,ఇన్‌పుట్స్, ఉత్పత్తి,సేకరణ,ప్రాసెసింగ్, నిల్వ,మార్కెటింగ్ వంటి అన్ని అంశాలను సమన్వయం చేయాలని తెలిపారు.గ్రామ పంచాయతీని కేవలం సహజ వనరుల నిర్వహణ కార్యక్రమా లకు మాత్రమే పరిమితం చేయకుండా,ప్రతి కుటుంబం యొక్క ఆదాయం,ఆహార భద్రత, వ్యవసాయం,పశుసంపద, ఎంటర్‌ప్రైజెస్,ఉపాధి అవకాశాలను అనుసంధానం చేసే వేదికగా అభివృద్ధి చేయాలని కలెక్టర్ సూచించారు.ప్రతి కుటుంబానికి వారి అవసరాలు,సామర్థ్యాలకు అనుగుణంగా తగిన ఎంటర్‌ప్రైజ్‌ను గుర్తించి, ఆర్థిక సంస్థలు,సంబంధిత శాఖలు,మార్కెట్ సంస్థల సహకారంతో అమలు చేసే విధంగా కార్యాచరణ




ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు.ఇప్పటికే ఉన్న ఎఫ్ పీ వో లను బలోపేతం చేయాలని,ప్రతి ప్రాంతంలో కొత్త రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేయడం కంటే,ఇప్పటికే సమర్థవంతంగా పనిచేస్తున్న ఎఫ్ పీ వోలను గుర్తించి వాటిని మరింత బలోపేతం చేయాలని కలెక్టర్ సూచించారు.అవసరం ఉన్న ప్రాంతాల్లో మాత్రమే కొత్త ఎఫ్ పీ వో లను ఏర్పాటు చేసి, వాటికి ప్రాసెసింగ్,నిల్వ, మార్కెటింగ్,వర్కింగ్ క్యాపిటల్,సాంకేతిక సహాయం వంటి అంశాల్లో అవసరమైన సహకారం అందించాలని తెలిపారు. ప్రతి ప్రణాళిక ఆర్థికంగా సాధ్యమైనది,దీర్ఘకాలికంగా నిలకడైనది,కుటుంబానికి ఆదాయం సమకూర్చే విధంగా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ప్రణాళిక రూపొందించే సమయంలో పెట్టుబడి,ఆదాయ అవకాశాలు,మార్కెట్, నిర్వహణ వ్యయం, కుటుంబానికి కలిగే ప్రయోజనం వంటి అంశాలను సమగ్రంగా అంచనా వేయాలని అధికారులను ఆదేశించారు."ఒక గ్రామం– ఒక సమగ్ర ప్రణాళిక–ప్రతి కుటుంబానికి ప్రయోజనం– స్థిరమైన ఆదాయం"అనే లక్ష్యంతో కార్యాచరణ ప్రణాళికలను రూపొందించి, వాటిని సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక సూచించారు.ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, కార్యక్రమ నోడల్ అధికారి సక్రియా నాయక్, ఉద్యాన శాఖ అధికారి సాయిబాబా, జిల్లా మత్స్యశాఖ అధికారి రెహమాన్,వాసన్ సంస్థ ప్రతినిధులు అనిల్ ఉప్పల పాటి,బక్కారెడ్డి,లక్ష్మణ్, మండల వ్యవసాయ శాఖ అధికారి,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# తిలక్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నేత్రధాన కార్యక్రమం....

## నేత్రదాత కుటుంబసభ్యులకు అభినందన పత్రం అందచేత

బెల్లంపల్లి (డీకే చాటింపు ) తిలక్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొన్ని రోజుల క్రితం కీ. శే భుపెల్లి లీల నేత్రధాన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం లీల గారి పెద్దకర్మ సందర్భంగా వారి కుటుంబసభ్యులకు తిలక్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తరుపున అభినందన పత్రం అందించడం జరిగింది. ఈ కార్యక్రమం లో మున్సిపల్ చైర్మన్ దావ స్వాతి రమేష్,కౌన్సిలర్ కల్పన,తిలక్ వాకర్స్ అధ్యక్షులు రంగ రామన్న, ప్రధాన కార్యదర్శి కంటే వాడ నగేష్, సభ్యులు భోగ శ్రీనివాస్, ఏనుగు నరేష్, డోలి సుకుమార్, పలువురు నాయకులు,తదితరులు పాల్గొన్నారు



# మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిపై పోలీసుల అమానుష వైఖరి --

## టిఆర్ఎస్ పార్టీ ఫ్లో లీడర్ భూపాల్ రెడ్డి , మాజీ మీర్పేట్ అధ్యక్షులు కామేష్ రెడ్డి ,-రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం



మహేశ్వరం, సెప్టెంబర్ 7 (డీకే చాటింపు) పోలీసుల కర్కశత్వం: అసెంబ్లీ వద్ద నిరసన తెలుపుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి జుట్టు పట్టుకుని పోలీసులు అమానుషంగా ప్రవర్తించడాన్ని తీవ్రంగా నిరసిస్తున్నామని టిఆర్ఎస్ పార్టీ ఫ్లో లీడర్ భూపాల్ రెడ్డి , మాజీ మీర్పేట్ అధ్యక్షులు కామేష్ రెడ్డి , అన్నారు ?మహిళా ఎమ్మెల్యేలకు దక్కని గౌరవం: మహిళా ప్రజాప్రతినిధి అని కూడా చూడకుండా పోలీసులు వ్యవహరించిన తీరు కాంగ్రెస్ ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని. అసెంబ్లీ వద్ద అరెస్టులు: నల్ల టీషర్టులతో శాసనసభకు వస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అడ్డుకుని అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య విరుద్ధం అని అన్నారు . రేవంత్ రెడ్డి భయపడుతున్నారు: "అసెంబ్లీకి రమ్మని పిలిచి, తీరా వస్తే భయపడి అరెస్టులు చేయిస్తున్నారు" అని సబితా ఇంద్రారెడ్డి గారు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అమానుష ఘటనకు నిరసనగా బడంగ్పేట్ సర్కిల్, మీర్పేట్ 58, 59, 60 డివిజన్ల బీఆర్ఎస్ ముఖ్య నాయకుల ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేయడం జరిగింది. ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలిపే హక్కును కాలరాస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరిస్తున్నాం.ఈ యొక్క కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ ఫ్లో లీడర్ భూపాల్ రెడ్డి , మాజీ మీర్పేట్ అధ్యక్షులు కామేష్ రెడ్డి , టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దీపులల్ చౌహాన్ మాజీ ఎంపిటిసి శ్రీను నాయక్ , మాజీ కార్పొరేటర్లు ఏనుగుల అనిల్ కుమార్ యాదవ్ , రాజ్ కుమార్ గారు మాజీ వెంకటేశ్వర స్వామి దేవాలయ ధర్మకర్త మాధురి రమేష్, యాదగిరి ముదిరాజ్, సిద్దాల అంజయ్య ,సుర్వి లత , మాజీ గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ మాధవి మహిళా నాయకురాలు సునీత , మాజీ ఎంపీటీసీ సభ్యులు లలిత కోఆప్షన్ సభ్యులు స్నేహలత, మహిళా నాయకులు పద్మ బిందు టిఆర్ఎస్ పార్టీ నాయకులు మోహన్ నాయక్ , వెంకటేష్ కుర్మా , ఉప్పాల రామకృష్ణ పాల్గొన్నారు

# ఇది బ్లాక్ డే..- రాజ్యాంగాన్ని ఖూనీ చేశారు

### పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 7: డీకే చాటింపు అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు తీవ్రంగా బాధాకరమని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి గారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.ఈరోజు జరిగిన ఘటన తెలంగాణ చరిత్రలో ఒక బ్లాక్ డే. ప్రజల సమస్యలను శాసనసభలో ప్రస్తావించేందుకు వెళ్తున్న మమ్మల్ని అడ్డుకోవడమే కాకుండా, మహిళలమని కూడా చూడకుండా పోలీసులు ఎటుపడితే అటు లాగడం అత్యంత దారుణం. మేము చేసిన తప్పేంటి? ప్రజల పక్షాన మాట్లాడటమే మేము చేసిన పాపమా?" అని ఆమె ప్రశ్నించారు. "కొంచెం తేడా జరిగి ఉంటే మేము ఇనుప గేట్లపై పడి తీవ్రంగా గాయపడే పరిస్థితి ఏర్పడేది. ఈ ఘటనతో మేము తీవ్ర మనోవేదనకు గురయ్యాం. మహిళలకు రక్షణ కల్పిస్తామని చెప్పే ప్రభుత్వం, మహిళా ప్రజాప్రతినిధులనే రక్షించలేని పరిస్థితి రావడం సిగ్గుచేటు. మహిళలను అవమానించడమే ఇందిరమ్మ రాజ్యమా?" అని సబితా ఇంద్రారెడ్డి గారు మండిపడ్డారు. అసెంబ్లీ వద్ద జరిగిన ఈ ఘటనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారే బాధ్యత వహించాలని ఆమె డిమాండ్ చేశారు. పోలీసుల అత్యుత్సాహంపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను బలవంతంగా అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ఆడబిడ్డ అంటే తెలంగాణ గౌరవం. ఆడబిడ్డను అమ్మలా చూసుకోవడం తెలంగాణ నేల సంస్కృతి. ఆడపిల్లను గుండెల్లో దాచుకుని కాపాడుకునే గొప్ప సంప్రదాయం మన తెలంగాణది. అలాంటి తెలంగాణ గడ్డపై, ఈరోజు ఒక మహిళా



ప్రజాప్రతినిధికి అసెంబ్లీ సాక్షిగా ఘోర అవమానం జరగడం అత్యంత బాధాకరం," అని ఆమె అన్నారు. గతంలో గురుకుల సభలో ఆడబిడ్డల గౌరవం గురించి మాట్లాడిన వారు, ఈరోజు చట్టసభలోనే మహిళా సభ్యుల గౌరవానికి భంగం కలిగించడం ఎంతవరకు సమంజసం? మహిళా సభ్యులకే రక్షణ కరువైతే ఇక రాష్ట్రంలోని సామాన్య మహిళలకు ఈ ప్రభుత్వం ఏం రక్షణ కల్పిస్తుంది?" అని ప్రశ్నించారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు తెలంగాణ ఆడబిడ్డలందరికీ క్షమాపణ చెప్పాలి. అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతులను అణచివేయడం ప్రజాస్వామ్యం కాదు." అని పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను ఇచ్చిన హామీలు ఏమయ్యాయి...

## బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ వినతి పత్రం అందచేత....

బెల్లంపల్లి (డీకే చాటింపు )కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన 6 గ్యారెంటీలు, 420 హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీ ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు, బెల్లంపల్లి నియోజకవర్గంలో మాజీ శాసన సభ్యులు దుర్గం చిన్నయ్య నేతృత్వంలో సబ్ కలెక్టర్ మనోజ్ కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు.ఎన్నికల ముందు అరచేతిలో వైకుంఠం చూపించి, 6 గ్యారెంటీలు--420 హామీల పేరుతో ప్రజలను నమ్మించి ఓట్లు దండుకున్న కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడుతోందని విమర్శించారు.ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చారు.. కానీ ప్రజల సమస్యలను మాత్రం మరిచిపోయారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు గుర్తున్నాయా? లేక అధికారం రాగానే ఆ హామీలన్నీ మర్చిపోయారా అని ప్రశ్నించారు.ఈ కార్యక్రమం లో మాజీ వైస్ చైర్మన్ సుదర్శన్, పట్టణ అధ్యక్షులు సత్యనారాయణ, కౌన్సిలర్లు గోగర్ల స్వప్న,




కంపెల్లి రాజాం పార్టీ ప్రధాన కార్యదర్శి రేవెళ్లి విజయ్,యువజన విభాగం అధ్యక్షుడు సబ్బని అరుణ్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు బడికెల శ్రవణ్,మాజీ కౌన్సిలర్లు రాజులాల్ యాదవ్,తాండ్ర రామకృష్ణ, మాజీ కో ఆప్షన్ వాజిద్,నాయకులు బండారి ప్రవీణ్,కలీం కలీల్,కార్యకర్తలు పాల్గొన్నారు

# ప్రభుత్వ ఆసుపత్రిలో బాలుడు కిడ్నాప్-

## కిడ్నాపర్లను 24 గంటల్లో పట్టుకున్న పోలీసులు





నిజామాబాద్ ప్రతినిధి సెప్టెంబర్ 7 (డీకే చాటింపు): నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లోని మాతా శిశు సంరక్షణ కేంద్రం నుండి శనివారం ఉదయం 10.30 నిమిషాల సమయం సుమారు రెండున్నర సంవత్సరాల వయస్సు గల బాలుడు వేదాంష్ ను ఇద్దరు వ్యక్తులు మాయమాటలు చెప్పి అపహరించిన సంఘటన జరిగింది.ఈ ఘటనపై బాలుడి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంబంధిత పోలీస్ స్టేషన్‌లో కేసునమోదు చేసి, పోలీస్ కమిషనర్, నిజామాబాద్ ఆదేశాలు మరియు పర్యవేక్షణలో బాలుడి ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, వెంటనే విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టడం జరిగింది.ఈ ఆపరేషన్‌లో టౌన్–× పోలీస్, జజూ, క్రైమ్ మరియు టెక్నికల్ టీమ్స్ సమన్వయంతో పనిచేశాయి. వివిధ ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలించడం, సాంకేతిక ఆధారాలను విశ్లేషించడం, అనుమానితుల కదలికలను గుర్తించడం వంటి చర్యలను నిరంతరం చేపట్టారు.పోలీస్ బృందాలు రాత్రింబవళ్లు నిరంతరంగా నిర్వహించిన గాలింపు మరియు దర్యాప్తు చర్యల ఫలితంగా, కేవలం 24 గంటల్లోనే సంగారెడ్డి జిల్లా దౌల్తాబాద్ గ్రామంలో బాలుడు వేదాంష్ ఆచూకీని గుర్తించి,అతనిని సురక్షితంగా రక్షించడం జరిగిందినీ ప్రెస్ మీట్ లో కమిషనర్ తెలియజేశారు.ఈ కేసులో నిందితులుగా గుర్తించిన ఎ1. కోతాడి సుజాత వయస్సు (30 ), నిజాంపేట్ గ్రామం, మెదక్ జిల్లా,ప్రస్తుతం మేడ్చల్‌లో నివాసం. 2. కోతాడి యెల్లం, వయస్సు (38 ), నిజాంపేట్ గ్రామం, మెదక్ జిల్లా, ప్రస్తుతం మేడ్చల్‌లో నివాసం ఉంటున్న వారినిఇద్దరిని పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకోవడం జరిగింది.రక్షించిన బాలుడు వేదాంష్, వయస్సు 2½ సంవత్సరాలు,కు అవసరమైన వైద్యపరీక్షలు మరియు చట్టపరమైన ప్రక్రియలను పూర్తి చేసిన అనంతరం ఈరోజు అతని తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగించడం జరుగుతుంది. ఈ కేసును 24 గంటల్లోనే ఛేదించి బాలుడిని సురక్షితంగా రక్షించడంలో టౌన్–×, సి సి ఎస్, క్రైమ్, సివిల్ మరియు టెక్నికల్ టీమ్స్ సమన్వయంతో చేసిన కృషి, అలాగే సంగారెడ్డి జిల్లా పోలీసుల సహకారం ఎంతో కీలకంగా నిలిచిందన్నారు. బాలుడిని సురక్షితంగా రక్షించి తల్లిదండ్రులకు అప్పగించేందుకు కృషి చేసిన సిసిఎస్ ఎసిపి శ్రీశైలం ,వన్ టౌన్ ఎస్ హెచ్ ఓ రఘుపతి, టెక్నికల్ టీం అధికారులు మరియు పోలీస్ సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించారు.

# గణేష్ ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించాలి



ఆర్మూర్ విలేఖరి సెప్టెంబర్ 6 (డీకే చాటింపు): ఆర్మూర్ లో గణేష్ చవితి పండుగను పురస్కరించుకొని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో శాంతి కమిటీ సమావేశం ఆర్మూర్ క్షత్రియ ఫంక్షన్ హాల్ యందు నిర్వహించారు.ఈసమావేశానికి పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, హాజరై గణేష్ ఉత్సవాల నిర్వహణ , భద్రతా ఏర్పాట్లు , శాంతిభద్రతలు , ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై శాంతి కమిటీ సభ్యులు , గణేష్ ఉత్సవాల నిర్వాహకులతోసమీక్షించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతమైన , సోదరభావంతో కూడిన శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. పండుగ అనేది ప్రజలందరినీ ఐక్యం చేసే కార్యక్రమమని , ప్రతి ఒక్కరూ పరస్పరం సహకరించు కుంటూ మత సామరస్యాన్ని కాపాడాలని కోరారు. గణేష్ మండపాల నిర్వాహకులు ముందస్తుగా పోలీసుల అనుమతులు తీసుకో వడంతో పాటు , పోలీస్ శాఖ సూచించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కమిషనర్ తెలిపారు. మండపాల వద్ద భద్రతా ప్రమాణాలు పాటిస్తూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లు , అగ్ని ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకో వాలని సూచించారు. మండపాల వద్దకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ ,పార్కింగ్,జనసందోహం నియంత్రణకు నిర్వాహకులు ప్రత్యేకంగా సహకరించాలని తెలిపారు. మండపాల వద్ద డీజేలు , సౌండ్‌సిస్టమ్‌ల వినియోగంలో ప్రభుత్వం నిర్దేశించిన శబ్ద పరిమితులు , సమయ నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు. గణేష్ నిమజ్జన కార్యక్రమం సందర్భంగా కూడా నిర్వాహకులు పోలీస్ శాఖతో సమన్వయం చేసుకొని ముందుగా నిర్ణయించిన మార్గాలు , సమయాలను పాటించాలని సూచించారు. నిమజ్జన ఊరేగింపులో పాల్గొనే వారు ఎలాంటి రెచ్చగొట్టే నినాదాలు , వివాదాస్పద చర్యలకు పాల్పడకుండా సంయమనం పాటించాలని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలు , వదంతులను నమ్మవద్దని , ఏదైనా అనుమానాస్పద సమాచారం లేదా సమస్య ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కమిషనర్ సూచించారు. ప్రజల భద్రతే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని , గణేష్ ఉత్సవాలు మరియు నిమజ్జన కార్యక్రమాలుప్రశాంతంగా,సురక్షితంగా , విజయవంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ అన్ని అవసరమైన భద్రతా చర్యలు చేపడు తుందని పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈకార్యక్రమంలో ఆర్మూర్ సబ్ కలెక్టర్ శ్రీ అభిజ్ఞాన మాలవ్య, ఆర్మూర్ ఏ.సి.పి వెంకటేశ్వర రెడ్డి , ఏ.సీ.పి ట్రాఫిక్ శ్రీ మస్తాన్ అలీ , స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి , ఆర్మూర్ ఎస్ హెచ్ ఓ సత్యనారాయణ గౌడ్, ఆర్మూర్ రూరల్ సీ.ఐ శ్రీ జాన్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి గోని లహరి, మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీ కాటేపల్లి వెంకట్ రెడ్డి, ఆర్మూర్ ఎస్సై శ్రీ రజనీకాంత్ ,బాల్కొండ ఎస్సై శ్రీ శైలందర్, మెండోరా ఎస్సై సుహాసిని, మున్సిపల్ కౌన్సిలర్లు , సర్పంచులు మరియు సార్వజని గణేష్ మండలి సభ్యులు , గణేష్ మండలి నిర్వాహకులు , ఆర్గనైజర్లు వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొనడం జరిగింది.


డీకే చాటింపు
తెలంగాణ దిన పత్రిక
మంగళవారం, సెప్టెంబర్,8, 2026

# ప్రజారోగ్యంపై కల్తీ ప్రభావం...!

నిత్యం మనం తీసుకునే ఆహారం అమృతం కావాలి. కానీ నేడు అది నెమ్మదిగా ప్రాణాలను హరించే విషంగా మారుతోంది. లాభాపేక్ష అనే రాక్షస కోరల్లో చిక్కుకున్న ఆహార రంగం, సామాన్యుడి ఆరోగ్యంతో చెలగాటమాడుతోంది. 'సర్వం కల్తీమయం' అన్నది కేవలం ఒక నానుడి కాదు. నేడు అది మన కళ్లముందు కదలాడుతున్న భయంకర వాస్తవం. భారతదేశంలో సామాన్య ప్రజల జీవన ప్రమాణాలు పెరగడం అటుంచితే, కనీస ఆరోగ్య భద్రత కరువవ్వడం ఆందోళన కలిగించే అంశం. వాతావరణ కాలుష్యం ఒకవైపు ఊపిరితిత్తులను ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే, మరోవైపు మనం తినే ఆహారంలో చేరుతున్న రసాయనాలు నిశ్శబ్దంగా మృత్యువును ఆహ్వానిస్తున్నాయి. ఉదయం నిద్రలేచిన దగ్గరి నుండి వాడే టూత్‌పేస్ట్, పాలు, టీపొడి, వంటనూనె, పప్పుధాన్యాలు.. ఇలా ఒకటేమిటి, ఏ వస్తువును తాకినా అందులో కల్తీ ఉందన్న వార్తలు వినియోగదారుడి వెన్నులోవణుకు పుట్టిస్తున్నాయి. గతంలో కల్తీ అంటే ఏదో ఒక వస్తువులో తక్కువ నాణ్యత గల పదార్థాలను కలపడం అని అనుకునేవారు. కానీ నేడు అది ఒక వ్యవస్థీకృత నేరంగా రూపాంతరం చెందింది. ఇటీవల దేశవ్యాప్తంగా జరిగిన దాడులు చూస్తుంటే, ఒక భారీ నెట్‌వర్క్ దీని వెనుక ఉన్నట్లు అర్థమవుతోంది. పాలు, పాల ఉత్పత్తులు: సూరత్ వంటి నగరాల్లో యూరియా, డిటర్జెంట్, ప్రాణాంతక రసాయనాలతో 'సింథటిక్ పాలు' తయారు చేయడం మానవత్వం లేని చర్య. పసిపిల్లలు తాగే పాలపై కూడా కనికరం లేని లాభాపేక్ష ఇది. పన్నీర్, నెయ్యిలో జంతువుల కొవ్వును కలపడం వంటి ఘటనలు ఆధ్యాత్మిక భావనలతోపాటు ఆరోగ్య భద్రతను కూడా దెబ్బతీస్తున్నాయి. ఢిల్లీలో వెలుగులోకి వచ్చిన నకిలీ టూత్‌పేస్ట్ తయారీ కేంద్రం మన దైనందిన జీవితంలో ఏ వస్తువునూ నమ్మలేమని నిరూపించింది. బ్రాండెడ్ కంపెనీల పేర్లతో నకిలీ ప్యాకింగ్ చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారు. రీ-లేబులింగ్ మాఫియా: గడువు ముగిసిన సాఫ్ట్‌డ్రింక్స్, ప్యాక్డ్ ఫుడ్స్‌పై పాత తేదీలను చెరిపివేసి కొత్త తేదీలు ముద్రించడం ద్వారా వినియోగదారుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ప్రస్తుత ఆధునిక సమాజంలో నగర జీవనం చాలా వేగంగా మారిపోయింది. ఉరుకుల పరుగుల జీవితంలో సొంతంగా వంట చేసుకునే తీరిక లేక చాలామంది బయటి ఆహారంపై ఆధారపడుతున్నారు. బిర్యానీ సెంటర్లు, టిఫిన్ సెంటర్లు, ఫాస్ట్ ఫుడ్ అవుట్‌లెట్లు నేడు ప్రతి గల్లీలోనూ దర్శనమిస్తున్నాయి. అయితే, ఈ కేంద్రాల్లో శుభ్రత అనేది మచ్చుకైనా కనిపించడం లేదు. హైదరాబాద్ వంటి నగరాల్లో వెలుగులోకి వచ్చిన అల్లం-వెల్లుల్లి పేస్ట్ తయారీ కేంద్రాల పరిస్థితి దారుణం. కుళ్ళిన అల్లం, వెల్లుల్లికి రంగులు, రసాయనాలు కలిపి ఆకర్షణీయమైన ప్యాకింగ్‌తో హోటళ్లకు సరఫరా చేస్తున్నారు. ఇలాంటి పదార్థాలను వాడటం వల్ల హోటల్ ఆహారం రుచికరంగా ఉన్నట్లు అనిపించినా, అది లోలోపల అవయవాలను చిత్తు చేస్తోంది. కల్తీ ఆహారం అనేది కేవలం ఒక వ్యక్తిగత సమస్య కాదు, ఇది దేశం ఎదుర్కొంటున్న అతిపెద్ద ప్రజారోగ్య సంక్షోభం. కల్తీ వల్ల కలిగే నష్టాలు తక్షణమే బయటపడవు. కానీ దీర్ఘకాలంలో అవి ప్రాణాంతకమవుతాయి. కేన్సర్ ముప్పు: వైద్య నిపుణుల నివేదికల ప్రకారం, దేశంలో నమోదవుతున్న కేన్సర్ కేసుల్లో సుమారు 53% ఆహారపు అలవాట్లు, కల్తీ ఆహారం వల్లే సంభవిస్తున్నాయి. ఆహారంలో కలిపే కృత్రిమ రంగులు కార్సినోజెనిక్‌గా మారుతున్నాయి. కలుషిత నీరు, కల్తీ పాలు, నాణ్యత లేని నూనెల వల్ల కాలేయం, మూత్రపిండాలు దెబ్బతింటున్నాయి. చిన్న వయస్సులోనే గుండెపోటులు రావడం వెనుక కల్తీ నూనెల ప్రభావం ఎంత ఉందో విశ్లేషించాల్సిన అవసరం ఉంది. పాలలో కలిపే ఆక్సిటోసిన్ వంటి హార్మోన్ల వల్ల పిల్లల ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం పడుతోంది. నిఘా వైఫల్యం ప్రశ్నలపై ఉక్కుపాదం ఆహార భద్రత ప్రమాణాలను పర్యవేక్షించాల్సిన 'ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా', రాష్ట్ర ప్రభుత్వాల ఆరోగ్యశాఖలు క్షేత్రస్థాయిలో విఫలమవుతున్నాయని చెప్పక తప్పదు. తనిఖీలు కేవలం పండుగ సీజన్లకు లేదా ఫిర్యాదులు వచ్చినప్పుడు మాత్రమే పరిమితం కాకూడదు. మరోవైపు, సోషల్ మీడియా యుగంలో ప్రజలు చైతన్యవంతులవుతున్నారు. ఆహార నాణ్యతను ప్రశ్నించే వారిపై రివర్స్ కేసులు నమోదు చేయడం లేదా వారిని వేధించడం ప్రజాస్వామ్య విరుద్ధం.

విలేకరులు కావలెను
రాజకీయ సంచలనాలకు ప్రతీకగా నిలిచిన
డీకే చాటింపు
తెలంగాణ దినపత్రిక
డీకే సారథ్యంలో చాటింపు దినపత్రికలో పనిచేయడానికి తెలంగాణాలోని అన్ని జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో పనిచేయడానికి ఆసక్తి, అనుభవం గల విలేకరులు కావలెను.
సంప్రదించండి :
సెల్ : 9603754136 - 7386287837

# ప్రగతిశీల ఆలోచనాపరుడు సురేంద్రనాథ్ బెనర్జీ



సర్ సురేంద్రనాథ్ బెనర్జీ (1848 నవంబరు 10 –1925 ఆగస్టు) బ్రిటిష్ రాజ్ కాలంలో భారత రాజకీయ నాయకులలో ఒకడు. తొలి భారతీయ రాజకీయ సంస్థలలో ఒకటైన ఇండియన్ నేషనల్ అసోసియేషన్‌ను స్థాపించాడు. దీని ద్వారా ఆనందమోహన్ బోస్‌తో కలిసి 1883, 1885 లలో ఇండియన్ నేషనల్ కాన్ఫరెన్స్ రెండు సెషన్లకు నాయకత్వం వహించాడు. బెనర్జీ తరువాత ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడిగా మారారు. కాంగ్రెస్ మాదిరిగా కాకుండా మోంటాగు–చెల్మ్‌స్‌ఫోర్డ్ సంస్కరణలను స్వాగతించాడు. చాలా మంది ఉదారవాద నాయకులతో అతను కాంగ్రెస్ నుండి నిష్క్రమించి, 1919 లో ఇండియన్ నేషనల్ లిబరేషన్ ఫెడరేషన్ అనే కొత్త సంస్థను స్థాపించాడు. అతను ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ వ్యవస్థాపక సభ్యులలో ఒకడు. సురేంద్రనాథ్ బెనర్జీ బెంగాల్ ప్రావిన్స్ లోని కలకత్తా (కోల్‌కతా) లో బెంగాలీ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. అతని తండ్రి దుర్గా చరణ్ బెనర్జీ వైద్యుడు, ఉదారవాద, ప్రగతిశీల ఆలోచనలు గలవాడు అతని తండ్రి అతనిపై తీవ్ర ప్రభావం చూపాడు. కలకత్తా విశ్వవిద్యాలయం నుండి పట్టా పొందిన తరువాత, అతను 1868 లో రోమేష్ చుందర్ దత్, బిహారీ లాల్ గుప్తాతో కలిసి ఇండియన్ సివిల్ సర్వీస్ పరీక్షలను రాయడానికి ఇంగ్లాండ్ వెళ్లాడు. అతను 1869 లో పోటీ పరీక్షల్లో నెగ్గినప్పటికీ, అతను తన వయస్సును తప్పుగా చూపించాడనే వాదనతో అతనిని నిషేధించారు. బెనర్జీ 1871 లో మళ్లీ పరీక్షను రాసి విజయం పొంది సిల్‌హెట్‌లో అసిస్టెంట్ మేజిస్ట్రేట్‌గా నియామకం పొందాడు. బెనర్జీ లండన్‌లోని యూనివర్శిటీ కాలేజీలో తరగతులకు కూడా హాజరయ్యాడు. అతను 1871 లో చివరి పరీక్షలు రాసి 1871 ఆగస్టులో భారత దేశానికి తిరిగి వచ్చాడు. 1874 లో, బెనర్జీ లండన్ తిరిగి వచ్చి మిడిల్ టెంపుల్ లో విద్యార్థి అయ్యాడు. బ్రిటిష్ వారి పట్ల విసుగు చెంది భారతదేశానికి తిరిగి వచ్చాడు. అతను ఇంగ్లాండ్‌లో ఉన్న సమయంలో (1874?1875), ఎడ్మండ్ బుర్కే, ఇతర ఉదార తత్వవేత్తల రచనలను అధ్యయనం చేశాడు. ఈ రచనలు బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా చేసిన నిరసనలలో అతనికి మార్గనిర్దేశం చేశాయి. అతన్ని ఇండియన్ బుర్కే అని పిలిచేవారు. 1882 లో అతను స్థాపించిన రిప్పన్ కాలేజీ (ఇప్పుడు సురేంద్రనాథ్ కాలేజీ)లో ఇంగ్లీష్ ప్రొఫెసర్ అయ్యాడు. అతను జాతీయవాద, ఉదారవాద రాజకీయ అంశాలతో పాటు భారతీయ చరిత్రపై బహిరంగ ప్రసంగాలు చేయడం ప్రారంభించాడు. అతను జూలై 26, 1876 న ఆనందమోహన్ బోస్‌తో కలిసి తొలి భారతీయ రాజకీయ సంస్థలలో ఒకటైన ఇండియన్ నేషనల్ అసోసియేషన్‌ను స్థాపించాడు. 1878 లో భారతీయ ప్రజలను బోధించడానికి జరిగిన సమావేశంలో ఆయన ఇలా అన్నాడు, "హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు, పరేసీల మధ్య శాంతి, సద్భావనల గొప్ప సిద్ధాంతం, మన దేశ ప్రగతి అన్ని వర్గాల మధ్య. "ఏకత్వం" అనే పదాన్ని అందులో మెరిసే బంగారం అక్షరాలు చెక్కనివ్వండి... మా మధ్య మత భేదం ఉండవచ్చు, సామాజిక వ్యత్యాసం ఉండవచ్చు. కానీ మనమందరం కలుసుకునే ఒక సాధారణ వేదిక ఉంది. ఇది మన దేశ సంక్షేమం వేదిక ". ఐసిఎస్ పరీక్షలకు హాజరయ్యే భారతీయ విద్యార్థులకు వయోపరిమితి సమస్యను పరిష్కరించడానికి అతను ఈ సంస్థను ఉపయో గించాడు. భారతదేశంలో బ్రిటిష్ అధికారులు దేశవ్యాప్తంగా ప్రసంగాల ద్వారా చేసిన జాతి వివక్షను ఆయన ఖండించాడు. ఇది తనను బాగా ప్రాచుర్యం పొందేట్లు చేసింది. 1879 లో, అతను ది బెంగాలీ అనే వార్తాపత్రికను స్థాపించాడు. 1883 లో, తన వార్తా పత్రికలో వ్యాఖ్యలను ప్రచురించినందుకు బెనర్జీని అరెస్టు చేసినప్పుడు, కోర్టు ధిక్కారంలో బెంగాల్ అంతటా, ఆగ్రా, ఫైజాబాద్, అమృత్‌సర్, లాహోర్, పూణే లలో హర్తాళ్ళు, నిరసనలు చెలరేగాయి. భారత జాతీయ కాంగ్రెస్ గణనీయంగా విస్తరించింది. కలకత్తాలో జరిగిన వార్షిక సమావేశానికి భారత దేశం నలుమూలల నుండి వందలాది మంది ప్రతినిధులు వచ్చారు. 1885 లో బొంబాయిలో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ స్థాపించిన తరువాత, బెనర్జీ 1886 లో వారి సాధారణ లక్ష్యాలు, సభ్యత్వాల కారణంగా తన సంస్థను అందులో విలీనం చేశాడు. 1895 లో పూనాలో, 1902 లో అహ్మదాబాద్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. 1905 లో బెంగాల్ ప్రావిన్స్ విభజనను నిరసించిన ప్రజా నాయకులలో సురేంద్రనాథ్ ఒకడు. బెనర్జీ ఈ ఉద్యమంలో ముందంజలో ఉన్నాడు. బెంగాల్, భారతదేశం అంతటా నిరసనలు జరిగి, విస్తృతమైన ప్రజా మద్దతును పొందాడు. ఇది చివరికి 1912 లో బెంగాల్ విభజనను తిప్పికొట్టడానికి బ్రిటిష్ వారిని బలవంతం చేసింది. భారత నాయకులైన గోపాల్ కృష్ణ గోఖలే, సరోజిని నాయుడులకు బెనర్జీ పోషకునిగా మారారు. మితవాద కాంగ్రెస్ సీనియర్ – మోస్ట్ నాయకులలో బెనర్జీ కూడా ఒకడు. విప్లవం, రాజకీయ స్వాతంత్ర్యాన్ని సమర్థించిన వారు బాలగంగాధర్ తిలక్ నేతృత్వంలో 1906 లో పార్టీని వీడారు. స్వదేశీ ఉద్యమంలో బెనర్జీ ఒక ముఖ్యమైన వ్యక్తిగా విదేశీ ఉత్పత్తులకు వ్యతిరేకంగా భారత దేశంలో తయారైన వస్తువులను సమర్థించాడు. 1909 లో మోర్లే–మింటో సంస్కరణలకు బెనర్జీ మద్దతు ఇచ్చాడు. మహాత్మా గాంధీ ప్రతిపాదించిన శాసనోల్లంఘన ఉద్యమం ప్రతిపాదిత పద్ధతిని బెనర్జీ విమర్శించాడు. మాంటెగ్ చెమ్స్ ఫర్డ్ సంస్కరణలను అంగీకరించడానికి సురేంద్రనాథ్ బెనర్జీ అనుకూలంగా ఉన్నాడు. కొందరు కాంగ్రెస్‌ను విడిచిపెట్టి ఇండియన్ లిబరేషన్ ఫెడరేషన్‌ను స్థాపించారు. వారిని ఉదారవాదులు అని పిలుస్తారు. ఆ తరువాత వారు భారత జాతీయ ఉద్యమంలో తమ సాంగత్యాన్ని కోల్పోయారు. బెంగాల్ ప్రభుత్వంలో మంత్రి పదవిని అంగీకరించడం అతనికి జాతీయవాదుల, ప్రజలకు కోపాన్ని కలిగించింది. అతను 1921లో సంస్కరించబడిన శాసనమండలికి ఎన్నుకోబడ్డాడు. అదే సంవత్సరంలో నైట్ , 1921 నుండి 1924 వరకు స్థానిక స్వపరిపాలన మంత్రిగా పదవిలో ఉన్నాడు. 1923 లో ఎన్నికలలో అతని ఓటమి అతని రాజకీయ జీవితాన్ని ముగించింది. కాగా 1923 లో బెంగాల్ శాసనసభ ఎన్నికలలో స్వరాజ్య పార్టీ అభ్యర్థి బిధన్ చంద్రరాయ్ చేతిలో ఓడిపోయాడు. బ్రిటిష్ సామ్రాజ్యానికి రాజకీయ మద్దతు ఇచ్చినందుకు అతను నైట్ అయ్యాడు. బెనర్జీ బెంగాల్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేస్తున్నప్పుడు కలకత్తా మునిసిపల్ కార్పొరేషన్‌ను మరింత ప్రజాస్వామ్య సంస్థగా మార్చాడు. ఆయన 1925 లో ప్రచురించబడిన ఎ నేషన్ ఇన్ మేకింగ్ ద్వారా విస్తృతంగా ప్రశంసలు అందుకున్నాడు. సురేంద్రనాథ్ 6 ఆగస్టు 1925 న బరాక్‌పూర్‌లో మరణించాడు. భారత రాజకీయాల అధికారికంగా మొదటిగా బాటవేసిన నేతగా –భారత రాజకీ యాల మార్గదర్శకునిగా బాగా గుర్తుంచుకోబడుతున్నాడు. బ్రిటీషువారు ఆయన చివరి సంవత్సరాలలో "సరెండర్ నాట్" బెనర్జీగా గౌరవించారు.

# ఇరాన్ పాచిక.. హార్ముజ్!




మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలు ప్రస్తుతానికి విడిపోయినట్లు కనిపిస్తున్నా, తెర వెనుక ఒక భారీ ఆర్థిక యుద్ధం మొదలైంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇరాన్ మధ్య కుదిరిన 'రెండు వారాల' తాత్కాలిక విరామం ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. అయితే, ఈ విరామం వెనుక ఇరాన్ వేసిన 'హార్ముజ్ టోల్' పాచిక ఇప్పుడు అంతర్జాతీయ చర్చకు దారితీస్తోంది. ఎందుకంటే మార్చి మధ్య వారంలోనే ఇరాన్ విదేశాంగ మంత్రి అరాగ్చీ హార్ముజ్ టోల్ ప్రతిపాదన తీసుకువచ్చారు. అంటే యుద్ధం అమెరికా మొదలుపెట్టినా.. యుద్ధం తర్వాత ఏం చేయాలన్న విషయంపై ఇరాన్ క్లారిటీతో ఉన్నదన్న విషయం అర్థమవుతుంది. అణు దాడుల భయమని, గల్ఫ్ యుద్ధం ముంచు కొస్తుందని ప్రపంచం భయపడుతున్న వేళ.. అనూహ్యంగా కాల్పుల విరమణ ప్రకటించడం వెనుక భారీ హైడ్రామా నడిచింది. అమెరికా తన 'ఆపరేషన్ మిడ్ నైట్ హామర్' ద్వారా ఇరాన్ అణు కేంద్రాలపై దాడులకు సిద్ధమైన వేళ, ఆ గడువు ముగియడానికి కేవలం 90 నిమిషాల ముందు ట్రంప్ నుండి సీజ్‌ఫైర్ ప్రకటన వెలువడింది. ఇరాన్ కూడా వ్యూహాత్మకంగా హార్ముజ్ జలసంధిని మూసివేయబోవడం లేదని, దానికి బదులు టోల్ వసూలు చేస్తామని ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదన వెనుక పాకిస్తాన్ పేరు వినిపిస్తున్నా, అసలు సూత్రధారి మాత్రం చైనా అని తెలుస్తున్నది. ఎందుకంటే మార్చి 31న ఇస్లామాబాద్‌లో సౌదీ అరేబియా, టర్కీ, ఈజిప్టు దేశాల మంత్రులతో కీలక సమావేశం నిర్వహించిన వెంటనే పాక్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ బీజింగ్ వెళ్లిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలి. ఇరాన్ ఈ శాంతి ఒప్పందానికి మొగ్గు చూపడం వెనుక చైనా ఇచ్చిన 'స్పష్టమైన హామీ' ఉందని విశ్లేషకులు భావి స్తున్నారు. చైనా తన చమురు అవసరాల కోసం హార్ముజ్ మార్గంపైనే ఆధారపడుతుంది. యుద్ధం జరిగితే చైనా ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుంది.. అందుకే 'యుద్ధం వద్దు – టోల్ కడతాం' అనే ఫార్ములాను చైనా తెరపైకి తెచ్చింది. ట్రంప్ కూడా చైనా పాత్రను ధ్రువీకరించడం గమనార్హం. ఎఎఫ్‌పీ వార్త సంస్థతో ఆయన మాట్లాడుతూ.. 'చైనా ఇరాన్‌ను టేబుల్ వద్దకు తెచ్చింది' అని అనడంతో ఈ విషయంలో క్లారిటీ వచ్చింది. ఇది అమెరికాకు ఒక 'గౌరవప్రదమైన నిష్క్రమణ' మార్గాన్ని ఇచ్చింది. మొత్తానికి ఈ నెల 10వ తేదీన శుక్రవారం ఇస్లామాబాద్‌లో జరిగే చర్చల్లో వచ్చే ఫలితంపైనే ఇరాన్, అమెరికా యుద్ధం ఆధారపడి ఉన్నది. హార్ముజ్ జలసంధి నుండి వెళ్లే ప్రతి భారీ నౌక (వీఎల్‌సీసీ.. వెరీ లార్జ్ క్రూడ్ క్రూయిజ్) నుంచి 2 మిలియన్ డాలర్లు (దాదాపు రూ. 18.5 కోట్లు) వసూలు చేయాలని ఇరాన్ నిర్ణయించింది. ఒక నౌక సుమారు 20 లక్షల బ్యారెల్ ఆయిల్‌ని మోసుకెళ్తుంది. ప్రస్తుత మార్కెట్ ధర బ్యారెల్‌కు 100 డాలర్ల చొప్పున లెక్కేస్తే, ఒక నౌకలోని ఆయిల్ విలువ సుమారు 200 మిలియన్ డాలర్లు (రూ.1,850 కోట్లు) ఉంటుంది. ఇరాన్ వసూలు చేసే 2 మిలియన్ డాలర్ల టోల్ వల్ల బ్యారెల్ ధరపై ఒక డాలర్ (రూ.92.25) అదనపు భారం పడుతుంది. యుద్ధానికి ముందు హార్ముజ్ నుంచి రోజుకు 100 నుండి 138 నౌకలు తిరిగేవి. ప్రస్తుత యుద్ధ విరామం తర్వాత, ట్రాఫిక్‌ను తిరిగి పునరుద్ధరిస్తే ఇరాన్ రోజుకు కనీసం 100 నౌకలను అనుమ తించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అంటే వంద నౌకలకు 2 మిలియన్ల చొప్పున వసూలు చేస్తే 200మిలియన్ డాలర్లు (రూ. 1,848కోట్లు) అవుతుంది. ఇక నెలకు 6 బిలియన్ డాలర్లు (రూ.55,440 కోట్లు), ఏడాదికి 70 నుంచి 90 బిలియన్ డాలర్లు (రూ.6.5 లక్షల కోట్ల నుంచి రూ.8.3 లక్షల కోట్లు) ఇరాన్ ఖాతాలో జమ కానున్నాయి.

# జన్యులోపమే పార్కిన్సన్‌కు మూలం

18వ శతాబ్దంలో జేమ్స్ పార్కిన్ సన్ అనే ఆంగ్లవైద్యుడు ఒక్కు ఒణుకు వ్యాధి అనే పేరుతో మొదట దీన్ని నిర్వచించిన కారణంగా పార్కిన్సన్స్ వ్యాధి అంటారు. ఈ వ్యాధి వేదకాలంలోనే ప్రస్తావించబడింది. ఆయుర్వేద సంహితలో అంటే ప్రాచీన భారతీయ వైద్యశాస్త్రంలో ఈ వ్యాధి, దాని లక్షణాలు, చికిత్స పేర్కొన బడ్డాయి. నాటి వైద్యశాస్త్ర నిపుణులు దీన్ని కంపవాత మన్నారు. 2500 సంవత్సరాలకు పూర్వమే నైజింగ్ (జెవతిఖేతినిణ) అనే చైనా వైద్యశాస్త్రంలో దీని గురించిన ప్రస్తావన వుంది. కంపవాతం ఆయుర్వేద రీత్యా ఒక నరాల జబ్బు. ఈ వ్యాధి సోకిన మనిషి కదలికలో వ్యత్యాసం కనిపిస్తుంది. కూర్చొని, పడుకొని ఉన్నంతసేపూ బాగుంటాడు. కాని లేచి నిలబడి కదలబోతే శరీరం వణికి ఇటూ అటూ కదిలిపోతూ పడిపోతుంటాడు. పార్కిన్సన్ వ్యాధిని ఇప్పటికీ కారణం తెలియని వ్యాధిగానే పరిగణిస్తు న్నారు. జన్యుపరంగా, పర్యావరణ కారణాలవల్ల ఈ వ్యాధి వస్తుంది. పర్యావరణ కాలుష్యం విషపదార్థాలు, ఎరువులు, డ్రగ్స్ (యాంటీ సైకోటిక్, వాంతి వచ్చే మందులు) తయారీ, తరచుగా తలనొప్పి తదితర కారణాలతో పార్కిన్సన్ వ్యాధి ముడిపడి ఉంది. మెదడులో ఉత్పన్నమయ్యే డోపమైన్ కణాలు తగ్గిన పక్షంలో ఈ వ్యాధి వచ్చినట్లు నిర్ధారణ చేసుకోవచ్చు. ప్రొటీనోపతి (ప్రోటీన్లకు సంబంధించిన రుగ్మత) వల్ల పార్కిన్సన్ వ్యాధివచ్చే అవకాశముంది. పార్కిన్సన్ వ్యాధి సర్వసాధారణ వ్యాధి. ఇది సమాజంలో ప్రబలంగా ఉంది. 60 ఏళ్లు దాటిన వయోవృద్ధులకు ఇది వస్తుంది. దీన్ని వృద్ధాప్యంలో వచ్చే అంగవైకల్య వ్యాధిగా పరిగణిస్తారు. "వణుకుడు రోగం" లేక "పార్కిన్సన్స్ వ్యాధి" నాడీ కణాలను (నరాల కణాలను) దెబ్బ తీయడం ద్వారా ప్రగతిశీల మెదడు దెబ్బకు దారితీస్తుంది. 'డోపమైన్' అని పలవబడే న్యూరోట్రాన్స్మిటర్ ద్వారా మెదడు అంతటా సంకేతాలు ప్రసరించే బాధ్యత ఈ నాడీ కణాలదే. సాధారణ పరిస్థితులలో, మృదువైన, సమతుల్య కండరాల సమన్వయాన్ని డోపమైన్ సహాయంతో సాధించవచ్చు. ఈ డోపామైన్ అనే ఈ న్యూరోట్రాన్స్మిటర్ లేకపోవడం మూలంగానే "పార్కిన్సన్స్ వ్యాధి" లేక వణుకుడు రోగం మనుషుల్లో సంభవిస్తుంది. పార్కిన్సన్స్ వ్యాధి యొక్క ప్రారంభ మరియు అత్యంత సాధారణ లక్షణాలు శరీరంలోని అవయవాల్లోని ఏదో ఒక భాగంలో... చేతులు లేదా కాళ్ళు లేదా దవడ లోనైనా, వణుకుడు రావడం. చేయి విశ్రాంతి దశలో ఉన్నప్పుడు ప్రకంపన లేదా వణుకు సాధారణంగా గుర్తించ బడుతుంది. సాధారణంగా చూపుడు వేలుకు వ్యతిరేకంగా బొటనవేలు యొక్క కదలికను చూడవచ్చు. దీని రెండవ లక్షణం సాధారణంగా కండరాలు పెడసరం లేదా కండరాలు బిగదీయడం. మనిషి స్వేచ్ఛా చలన వలయాల్ని కుంటుపరుస్తూ (పరిమితం చేస్తూ) అనియంత్రితమైన కండరాల పెడసరం లేక కండరాలు పట్టేయడ మనేది వణుకుడు వ్యాధి లక్షణం.వ్యాధికి గురైన వ్యక్తులు చేపట్టిన ఏదైనా పనియొక్క వేగంలో క్రమమైన తగ్గుదలను చూపుతారు. స్నానం లేదా తినడం వంటి సాధారణ కార్యకలాపాల్ని పూర్తి చేయడంలో కూడా వీళ్ళు అసాధారణంగా ఎక్కువసేపు తీసుకోవాల్సి వస్తుంది.సాపేక్షంగా అరుదుగా ఉండే లక్షణాలలో భయము, చొంగ కార్చడం, చర్మ సమస్యలు, మూత్ర సమస్యలు, లైంగిక అసమర్థత ఉంటాయి. వ్యాధి బాధితుడి వణుకుడు గణనీయంగా సదరు వ్యక్తి మాటల్ని మరియు చేతివ్రాతను దెబ్బ తీస్తుంది. వణుకుడు రోగానికి సంభావ్య కారణాలను గుర్తించడానికి పరిశోధన కొనసాగుతున్నప్పటికీ, అదిఎప్పటికీ తెలియదు. జన్యు కారకాలు మరియు కొన్ని పర్యావరణ పరిస్థితుల్లి వణుకుడు జబ్బుకు ప్రమాద కారకాలుగా భావిస్తారు.

# ఆర్యవైశ్యులు నిస్వార్ధ సమాజ సేవకులు..మందకృష్ణ మాదిగ



వరంగల్ సెప్టెంబర్ 7 (డీకే చాటింపు) సమాజంలో నిస్వార్ధ సేవకులైన ఆర్యవైశ్యులు, మాదిగల మధ్య తరతరాల నుండి ఆత్మీయ అనుబంధం కొనసాగుతుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అన్నారు.వరంగల్ నగరంలో రామన్నపేట ఆర్యవైశ్య సత్రం ప్రాంగణంలో గట్టు మహేష్ బాబు అధ్యక్షతన నిర్వహించిన ఆర్యవైశ్య ముఖ్యుల సమావేశానికి ముఖ్యఅతిథిగా మందకృష్ణ మాదిగ హాజరై మాట్లాడుతూ నా చిన్నతనంలో నా గ్రామంలో పేద కూలీలకు రోజువారి వేతనం దొరకని సమయంలో ఆర్యవైశ్యులే మాకు అండగా ఉండి కావలసిన నిత్యవసర వస్తువులు అరవుగా (ఉద్దెర) ఇచ్చి మా కుటుంబాలను ఆదుకునేవారన్నారు. నేను కళ్ళారా చూసిన ఈ సత్యాన్ని నా జీవితంలో ఎన్నటికీ మర్చిపోలేను అని గుర్తు చేసుకున్నారు. ఎవరికి అన్యాయం జరిగినా, కించపరిచిన, మీకు అండగా నిలబడి పోరాటం చేసిన చరిత్ర ఎమ్మార్పీఎస్కు ఉందన్నారు! గతంలో ఆర్యవైశ్యులకు, బ్రాహ్మణులకు సమస్యలు ఎదురైనప్పుడు వారికి పూర్తి నైతిక మద్దతు ఇచ్చి, ముందు వరుసలో నిలిచామన్నారు. 1997 నుండి ఆర్యవైశ్యులతో కలిసి నడుస్తున్నానని భవిష్యత్తులో ఇదే ఆత్మీయ బంధంతో మీకు మద్దతు ఇస్తూ, ముందుకు సాగుతానని మంద కృష్ణ మాదిగ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గట్టు మహేష్ బాబు మాట్లాడుతూ ఆర్యవైశ్యులు ఒకవైపు వ్యాపార రంగంలో స్థిరపడుతూనే, మరోవైపు సమాజం పట్ల అత్యంత సేవా నిరతి కలిగి, సమాజ శ్రేయస్సు ధ్యేయంగా కుల మతాలకు అతీతంగా, వివిధ సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ,ఎల్లవేళలా మా వ్యాపార రంగాలలో వేలాది మందికి ఉపాధి కల్పిస్తూ ,ప్రజల మన్నలను పొందగలుగుచున్నామన్నారు. మందకృష్ణ మాదిగ ఎలాంటి పదవులు ఆశించకుండా,పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు.

ముఖ్యంగా సమాజంలోని వెనుకకు నెట్టబడిన ప్రజల కొరకై,అంటరానితనంపై పోరాటం చేసి,అంటరా నితనం అమానుషం అని బలంగా ప్రచారం చేస్తూ,డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో ఎన్నో నిరసనలు, ఉద్యమాలు శాంతియుతంగా పోరాడి పద్మశ్రీ మందకృష్ణ మాదిగ రాబోయే తరాలకు చిరస్థాయిగా,ఆదర్శంగా స్ఫూర్తిగా నిలుస్తారని,

మన ఆర్యవైశ్య సమాజానికి భవిష్యత్తులో ఏ సమస్య వచ్చినా అండగా ఉండాలని ఆకాంక్షిస్తూ, సహృద్భావ సంబంధాలు మద్దతు ఇలాగే కొనసాగాలని ఆకాంక్షిస్తున్నట్లు గట్టు మహేష్ బాబు అన్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మదేవర సోమలింగం, సోమరామయ్య,తాటికొండ చక్రపాణి,గంప అమర్నాథ్,తా టిపల్లి రాజేశ్వరరావు , తోట సంపత్ కుమార్, పేద ప్రకాష్,ప్రముఖ వ్యాపార వేత్త పి ఎన్ మూర్తి , పిన్న మోహన్ రావు,పుల్లూరి మధు, గుండా సతీష్, గౌరిశెట్టి శ్రీనివాస్, ఇరుకుల్ల రమేష్, తాటికొండ ప్రభాకర్,ఎమ్మార్పీఎస్ నాయకులు పుల్ల శ్రీనివాస్,రాష్ట్ర అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

### శ్రీ రఘునాథ ఆలయం ఖిల్లా లో

# ఘనంగా సీతారాముల కళ్యాణం



ఆర్మూర్ విలేఖరి సెప్టెంబర్ 7 (డీకే చాటింపు): ఖిల్లా రఘునాథ ఆలయంలో సోమవారం అంగరంగ వైభవంగా కళ్యాణం నిర్వహించారు. ప్రతినెల పునర్వసు నక్షత్రం రోజు జరిగే కళ్యాణం లో భాగంగా ఈ రోజు మహానంది సంతోష్ . నాగలక్ష్మి దంపతులు కళ్యాణంలో కూర్చున్నారు.

అదేవిధంగా ఐదు పీతలతో శ్రీ సత్యనారాయణ వ్రతాలు కూడా నిర్వహించినారు.శ్రీ సీతారాముల కళ్యాణం నాని పంతులు నిర్వహించిన విధానం బాగుందని వసతులు బాగున్నాయని దాతలు వీక్షకులు కొనియాడారు .ఇట్టి కార్యక్రమా నికి శ్రీ రఘునాథ ఆలయ శాశ్వత ట్రస్ట్ సభ్యులు, భక్తులు అధికంగా పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందినారు. తదుపరి మాసంలో పునర్వసు నక్షత్రం కళ్యాణం అక్టోబర్ 4న ఆదివారం నవంబర్ 1, ఆదివారం, నవంబర్ 28 శనివారం , డిసెంబర్ 25శుక్రవారం ఉంటుందని ట్రస్ట్ చైర్మన్ మొక్క దేవేందర్ గుప్తా తెలిపారు. 12 నెలల పాటు కళ్యాణం జరిపించుటకుగాను నల్లూరి రమేష్ రమ్య దంపతులు ప్రతినెల 5121/- రూపాయలు చెల్లించేరని చైర్మన్ చెప్పారు.కళ్యాణంలో పాల్గొనే దాతలు తమ పేర్లు ముందుగా కమిటీ వారి వద్ద నమోదు చేయించుకోగలరనీ కోరారు.

## అరుణ ఫ్రెష్ మీట్ హౌస్ ప్రారంభం..నిర్వాహకులు సురేష్ వెల్లడి



హనుమకొండ సెప్టెంబర్ 7 డీకే.చాటింపు గ్రేటర్ వరంగల్ 5 వ డివిజన్ హనుమకొండ లోని వినాయక నగర్ కాలనీ ఎస్.బీ.హెచ్. పక్కన నూతనంగా నిర్వాహకులు సురేష్ ఏర్పాటు చేసిన అరుణ ఫ్రెష్ మీట్ హౌస్ ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రారంభోత్సవం సందర్భంగా కిలో చికెన్ మార్కెట్ రేట్ కన్నా 20 రూ తక్కువకు లభిస్తుందన్నారు.అరుణ ఫ్రెష్ మీట్ హౌస్ నందు మటన్, ఎగ్స్,డ్రై మటన్ సరసమైన ధరలకు లభిస్తుందన్నారు. వివాహాది, శుభకార్యాలకు ఆర్డర్లపై సప్లయ్ చేయబడునని,మా వద్ద డ్రై మటన్ లభిస్తుందని తెలిపారు.చికెన్, మటన్ ఆర్డర్ల కోసం సెల్ నంబర్ 9866402266 సంప్రదించాలని నిర్వాహకులు సురేష్ తెలిపారు.

## సిరి గాధ అశోక్ చారి ని ది అఖిల భారత విశ్వకర్మ మహాసభ వర్కింగ్ అధ్యక్షులు గా నియామకం



జగిత్యాల, సెప్టెంబర్ 7 (డీకే చాటింపు) ది అఖిల భారత విశ్వకర్మ మహాసభ ఉమ్మడి కరీంనగర్ జిల్లాల అధ్యక్షులు బొందుకూరి శ్రీనివాసచారి రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటకు చెందిన సిరి గాధ అశోక్ చారి వర్కింగ్ అధ్యక్షులు నియమించడం జరిగింది వీరికి సహకరించిన మంచిర్యాల జిల్లా అధ్యక్షులు శ్రీరాముల గంగాధర్ ప్రధాన కార్యదర్శి నస్పూరి శ్రీనివాస్ చారికి ధన్యవాదములు తెలియజేశారు.

### బిడ్ వేసి చేతులెత్తేసిన బిల్డర్.. రూ.5 కోట్లు లాస్

**హైదరాబాద్,** : హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో సంచలనం సృష్టిస్తూ కోకాపేట ప్లాట్ నంబర్ 17లో 4.59 ఎకరాల భూమికి ఎకరాకు రూ. 136.50 కోట్ల చొప్పున బిడ్ వేసిన వజ్రా కన్స్ట్రక్షన్స్ చెల్లింపులు చేయలేకపోయింది. దీంతో వేలం నిబంధనల ప్రకారం హెచ్ఎమ్డీఏ సదరు సంస్థ చెల్లించిన రూ. 5 కోట్ల ఈఎమ్డీ డిపాజిట్ను జప్తు చేసింది. ప్రీ-లాంచ్ విక్రయాల ద్వారా నిధులు సమీకరించాలనే వ్యూహం ఫలించకపోవటంతో భూమితో పాటు డిపాజిట్నూ సదరు సంస్థ కోల్పోయింది. కాగా, ఈ భూమిని మళ్లీ వేలం వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

## రేవంత్ ముందు కాంగ్రెస్ ఎమ్మెల్యే

**హైదరాబాద్:** రాజకీయాలలో గతంలో ఈ స్థాయిలో సంచలన పరిణామాలు జరిగేవి కావు. కానీ ఇటీవల కాలంలో పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని లక్ష్యంగా చేసుకొని గులాబీ పార్టీ నేతలు తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్నారు. చివరికి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు కూడా రేవంత్ నాయకత్వాన్ని తప్పుపడుతున్నారు. ఇక ఒక ఎమ్మెల్యే అయితే మరింత ముందడుగు వేసి రేవంత్ ముందే.. అనకూడని మాట అనేశాడు. ఇది ప్రమాదవశాత్తు జరిగిందా.. తొందరపాటు వల్ల జరిగిందా అనే విషయాన్ని పక్కన పెడితే.. జరగాల్సిన నష్టం జరిగిపోయింది. సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలను శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి బీసీ సంఘాల ప్రతినిధులను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురించి మాట్లాడుతూ.. ఒకసారిగా సీఎం కేసీఆర్ అని సంబోధించారు. దీంతో అక్కడ వాతావరణం మారిపోయింది. ఆ తర్వాత తన తప్పు తెలుసుకుని దానం నాగేందర్ సీఎం రేవంత్ రెడ్డి అని పేర్కొన్నారు.దానం నాగేందర్ చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోను గులాబీ పార్టీ నేతలు విస్తృతంగా సర్కులేట్ చేస్తున్నారు. గతంలో కూడా రేవంత్ రెడ్డిని ఓ కార్యక్రమానికి నిర్వాహకులు ఆహ్వానించారు. ఆ సమయంలో వేదిక ముందు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి అనబోయి సీఎం కేసీఆర్ అని పేర్కొన్నారు. ఆ తర్వాత అల్లు అర్జున్ కూడా ఓ కార్యక్రమంలో సీఎం పేరును తప్పుగా పలికారు. ఇలా అనేక సందర్భాలలో రేవంత్ రెడ్డి పేరును నిర్వాహకులు మర్చిపోయారు. చివరికి కాంగ్రెస్ నాయకులు కూడా రేవంత్ రెడ్డి పేరుకు బదులుగా కేసీఆర్ పేరు పలికారు. దీంతో ఇది గులాబీ పార్టీ నేతలకు ఆయుధంగా మారింది. రేవంత్ రెడ్డి పేరు సీఎంగా ఎవరూ గుర్తుంచుకోవడంలేదని.. కెసిఆర్ తెలంగాణ ప్రజల్లో.. తెలంగాణ నాయకుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిం దని గులాబీ పార్టీ నేతలు కవరింగ్ ఇచ్చుకోవడం మొదలుపెట్టారు.

# బిఆర్ఎస్ శాసనసభ్యులపై చేసిన దాడి - ప్రజాస్వామ్యం పై దాడి

**- అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ శాసనసభ్యులపై పోలీసుల నిరంకుశ దాడికి నిరసనగా ఎల్బీనగర్‌లో భారీ రాస్తారోకో -భవాని ప్రవీణ్ కుమార్ మరియు బీఆర్ఎస్ నాయకుల తీవ్ర నిరసన!**



ఎల్బీనగర్, సెప్టెంబర్ 7( డీకే చాటింపు) ఈరోజు అసెంబ్లీ ప్రాంగణం వద్ద కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల వైఫల్యాలను, ప్రజలకు ఇచ్చిన 420 హామీల మోసాలను ప్రశ్నించడానికి వెళ్లిన బీఆర్ఎస్ పార్టీ శాసనసభ్యులపై పోలీసులు అమానుషంగా ప్రవర్తించి, నిరంకుశంగా లాఠీచార్జ్ చేయడమే కాకుండా గాయాల పాలు చేసి తోపులాటలకు పాల్పడటాన్ని తీవ్రంగా ఖండిస్తూ ఎల్బీనగర్ నియోజకవర్గ వ్యాప్తంగా భవాని ప్రవీణ్ కుమార్ గారు మరియు నియోజకవర్గంలోని ఇతర టీఆర్ఎస్ పార్టీ లీడర్లతో కలిసి రేవంత్ రెడ్డి చేయించిన ఈ అప్రజాస్వామిక దాడికి వ్యతిరేకంగా రాస్తారోకో నిర్వహించారు...ఈ రౌడీయిజానికి, నిరంకుశత్వానికి వ్యతిరేకంగా గడ్డిఅన్నారం డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రీ భవాని ప్రవీణ్ కుమార్ గారు మరియు నియోజకవర్గంలోని వివిధ డివిజన్ల మాజీ కార్పొరేటర్లు, పార్టీ సీనియర్ నాయకులు, ముఖ్య నాయకులు మరియు శ్రేణులందరూ కలిసి ఎల్బీనగర్ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు.ఈ సందర్భంగా రహదారిపై బైఠాయించి కాంగ్రెస్ ప్రభుత్వ దౌర్జన్యాలకు, పోలీసుల నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రాస్తారోకోతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోవడంతో వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు నిరసనకారులను అడ్డుకుని, భవాని ప్రవీణ్ కుమార్ గారితో పాటు పాల్గొన్న నాయకులందరినీ సరూర్ నగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా భవాని ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ :లి"ప్రజాస్వామ్యంలో ప్రజలకు ఇచ్చినటువంటి హామీలను నెరవేర్చమని ప్రజాస్వామ్య పద్ధతిలో అడిగితే.. అసెంబ్లీ సాక్షిగా ఎమ్మెల్యేల పైనే లాఠీచార్జ్‌లు చేయించడం, దాడులకు తెగబడటం ఈ రేవంత్ రెడ్డి ప్రభుత్వ పిరికిపంద చర్యకు నిదర్శనం! చట్టసభల్లో ప్రజాప్రతినిధుల గొంతు నొక్కాలని చూసినా, రోడ్లపై కార్యకర్తలను అరెస్టులు చేసి జైళ్లల్లో పెట్టినా బీఆర్ఎస్ పోరాటం ఆగదు! కాంగ్రెస్ నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నెరవేర్చే వరకు, వారిలో పొలిటికల్ అకౌంటబిలిటీ (రాజకీయ జవాబుదారీతనం) తీసుకువచ్చేంత వరకు ప్రజల తరఫున క్షేత్రస్థాయిలో మేము పోరాడుతూనే ఉంటాం!"?ఈ నిరసన కార్యక్రమంలో గడ్డిఅన్నారం డివిజన్ తో పాటు ఎల్బీనగర్ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, యువజన, విద్యార్థి, మహిళా విభాగాల ప్రతినిధులు మరియు పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొని ప్రభుత్వ నిరంకుశ వైఖరిని ఎండగట్టారు.

# కాంగ్రెస్ వైఫల్యాలపై ప్రజావాణిలో బిఆర్ఎస్ కార్యకర్తల ఫిర్యాదు



ఆర్మూర్ విలేకరి సెప్టెంబర్ 7 (డీకే చాటింపు):కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపైభారత రాష్ట్ర సమితి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పిలుపు మేరకు నిజామాబాద్ జిల్లా పార్టీ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి సూచన మేరకు నందిపేట్ మండల కేంద్రంలో మండల పార్టీ అధ్యక్షుడు మచ్చర్ల సాగర్ ఆధ్వర్యంలో ప్రజావాణిలో కాంగ్రెస్ ప్రభుత్వం పై పిర్యాదు చేశారు.ఎన్నికలలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను 13 డిక్లరేషన్ లను కచ్చితంగా అమలు చేయాలని స్థానికంగా రైతులకు వెంటనే గుత్ప ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందించాలని ప్రజావాణిలో వినతిపత్రం అందించడం జరిగింది. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని గళమెత్తారు.ఈకార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు బాలగంగాధర్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ డైరెక్టర్ వెల్మల్ రాజన్న మాజీ సర్పంచులు బాబు రాజ్, రామారావు ,మురళి, మాజీ ఎంపిటిసి మోహన్ ,పార్టీ నాయకులు దారం సురేష్, కంఠం ప్రవీణ్ ,పిప్పర శ్రీనివాస్, గణేష్ రాజేందర్, గంధం సాయిలు, గంధం శేఖర్ ,తాటికాయల సాగర్, జూల రవి, ఉమ్మడ దర్శన్, ప్రభాకర్, నరేష్, రాజేశ్వర్ సదనంద్ నాయకులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## విశ్వ కర్మల కార్పొరేషన్ ఏర్పాటుపై ప్రభుత్వం పై పోరాడాలని అఖిల భారత విశ్వకర్మ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కౌలే జగన్నాధం




హైదరాబాద్, సెప్టెంబర్ 7 (డీకే చాటింపు) అఖిల భారత విశ్వకర్మ మహాసభ ఈరోజు కామారెడ్డి జిల్లాలో జిల్లా అధ్యక్షులు సతీష్ చారి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా 300 మంది విశ్వకర్మల సమక్షంలో మీటింగ్ ఏర్పాటు చెయ్యడం జరిగింది.. ఈ కార్యక్రమంలో విశ్వకర్మల సమస్యల పైన, విశ్వ కర్మల కార్పొరేషన్ పైన ప్రభుత్వం పై పోరాడాలని వివరించడం జరిగింది. ఈ కార్యక్రమం లో రాష్ట్ర అధ్యక్షులు కౌలే జగన్నాధం , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంకోజు లింగా చారి, గౌరవ అధ్యక్షులు కడారి వీరబ్రహ్మం , గౌరవ అధ్యక్షులు పట్నాల సావిత్రి , మహిళా అధికార ప్రతినిధి కస్తోజు శ్రావణి,రాష్ట్ర ఉపాధ్యక్షురాలు విప్రోజు వరలక్ష్మ, యూత్ అధ్యక్షులు కౌలే జగన్నాధం, రవి చారి , నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు గంగా మోహన్ కమిటీ,మంచిర్యాల జిల్లా అధ్యక్షులు శ్రీరాముల గంగాధర్, ప్రధాన కార్యదర్శి మునిగంటి శ్రీనివాస్, మెదక్ జిల్లా కమిటీ గంగాధర్,మహిళలు, కుల బంధువులు పాల్గొనడం జరిగింది


# కాంగ్రెస్ ఎన్నికల హామీలను అమలు చేయాలి ఇచ్చిన 420 హామీలను నెరవేర్చాలి--

## ఎల్.బి.నగర్.నియోజకవర్గ భారస నాయకులు

ఎల్బీనగర్, సెప్టెంబర్ 7 (డి కే చాటింపు) కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 420 హామీలు, 13 డిక్లరేషన్లు,6 గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని భారస నాయకులు డిమాండ్ చేశారు.ఎన్నికల సమయంలో 100 రోజుల్లో హామీలన్నీ అమలు చేస్తామని చెప్పి, నేటికీ అనేక హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు.ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలను అమలు చేసి ప్రజలకు రావాల్సిన ప్రయోజనాలను అందించాలని కోరుతూ సరూర్ నగర్ ఎం.ఆర్.ఓ.కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆడబిడ్డలకు మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం, తులం బంగారం తదితర హామీలను అమలు చేయాలి. రైతులకు రైతు భరోసా, ప్రతి పంటకు బోనస్, 24 గంటల నిరంతర ఉచిత విద్యుత్ వంటి హామీలను నెరవేర్చాలి. రైతు కూలీల సంక్షేమానికి రూ.12,000 సహాయం అందించాలి. ఇల్లు లేని ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలి. అర్హులైన నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి, ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్ అమలు చేయాలి. విద్యార్థులకు విద్యా భరోసా, పెండింగ్ ఫీజు బకాయిల చెల్లింపుతో పాటు విద్యార్థుల సంక్షేమ హామీలను అమలు చేయాలి. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, బీడీ కార్మికులకు పెంచిన పెన్షన్లు అందించాలి. ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12,000 ఆర్థిక సహాయం అందించాలి. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, విద్యార్థులు, యువజనులు, రైతులు తదితర వర్గాలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలి. గ్రామాలు, పట్టణాల్లో పెండింగ్‌లో ఉన్న పారిశుద్ధ్య, మౌలిక వసతుల సమస్యలను పరిష్కరించాలి.ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేయడం సరికాదని కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే స్పందించి అన్ని ఎన్నికల హామీలను అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ,భవాని ప్రవీణ్ కుమార్,పద్మానాయక్,సాగర్ రెడ్డి,,డివిజన్ అధ్యక్షులు చిరంజీవి,వరప్రసాద్ రెడ్డి,సత్యంచారి,శ్రీశైలం యాదవ్,రాజిరెడ్డి,తోట మహేష్ యాదవ్, సొంటి చంద్రశేఖర్ రెడ్డి పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




# ఏబీవీకి ఏమైంది..?



**విజయవాడ:** రాజకీయాల్లో శత్రువుకి శత్రువు మిత్రుడు కావడం ఎంత సహజమో, ఐడియాలజీ లేదా స్వప్రయోజనాల విషయంలో విభేదాలు వస్తే నిన్నటి మిత్రుడే నేడు తీవ్ర విమర్శకుడిగా మారడం కూడా అంతే సహజం. మాజీ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు విషయంలో ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో జరుగుతున్న చర్చ సరిగ్గా ఈ సమీకరణాల చుట్టూనే తిరుగుతోంది. వైఎస్సార్సీపీ హయాంలో కక్షసాధింపు చర్యలకు గురయ్యారనే సానుభూతితో, ఆయనకు అండగా నిలిచిన టీడీపీ శ్రేణులు.. నేడు ఆయన మారుతున్న వైఖరిని చూసి తీవ్రఆగ్ర్భాంతికి గురవుతున్నాయి ప్రభుత్వ హయాంలో ఏబీ వెంకటేశ్వరరావు సస్పెన్షన్‌కు గురై, తీవ్ర కేసులను ఎదుర్కొన్న సమయంలో టీడీపీ శ్రేణులు, మీడియా ఆయనను ఒక బాధితుడిగా ‘ భావించి పూర్తి స్థాయిలో మద్దతుగా నిలిచాయి. ప్రభుత్వ యంత్రాంగం ఆయనపై చూపిన కఠిన వైఖరిని తప్పుబడుతూ ఆయనకు సుదీర్ఘ పోరాటంలో అండగా నిలిచాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయనపై ఉన్న సీఐడీ కేసులు, విచారణలను పక్కనబెట్టి, ఆయన వివాదాలకు ముగింపు పలికి క్లీన్ చిట్ లభించేలా చట్టబద్ధమైన ఊరట నిచ్చింది. అయితే, ఆ తర్వాత ఏబీ వెంకటేశ్వరరావు అనుసరిస్తున్న తీరు, ఆయన మాటల శైలి టీడీపీ క్యాడర్‌కు తీవ్ర మింగుడుపడటం లేదు. ఇటీవలి కాలంలో ఆయన ప్రభుత్వ ప్రాజెక్టులు, పాలనాపరమైన నిర్ణయాలపై తీవ్ర విమర్శలు గుప్పిస్తుండటం చర్చనీయాంశమైంది. రాయలసీమ ప్రాజెక్టులైన కడప స్టీల్ ప్లాంట్‌పై స్పందిస్తూ.. అది కేవలం ఒక రోలింగ్ మిల్ మాత్రమేనని, సమగ్ర స్టీల్ ప్లాంట్ కాదంటూ ప్రెస్ మీట్లు పెట్టి చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. గతంలో ఆయనను తీవ్రంగా వేధించిన, ట్రోల్ చేసిన వైఎస్సార్సీపీ సానుభూతి మీడియా ఛానెళ్లకు, యూట్యూబ్ వేదికలకు ప్రత్యేక ఇంటర్వ్యూలు ఇస్తూ, కూటమి ప్రభుత్వ నిర్ణయాలను తప్పుపట్టడం ద్వారా ఆయన పూర్తిగా ప్రత్యర్థి ఫోల్డ్‌లోకి వెళ్లిపోయార నే భావన వ్యక్తమవుతోంది. వ్యక్తిగత అజెండాలు లేదా ప్రభుత్వంపై పెంచుకున్న తీవ్రమైన అసంతృప్తి వల్ల విచక్షణ కోల్పోయి, లేనిపోని అంశాలపై విమర్శలు చేస్తున్నారనే విమర్శలు ఆయనపై వస్తున్నా యి. గతంలో ఆయన పడిన కష్టాలకు మద్దతుగా నిలిచి, ఆయనను నెత్తిన పెట్టుకున్న టీడీపీక్యాడర్ ఇప్పుడు ఇలాంటి వ్యక్తినా మనం సమర్థించింది అని తీవ్ర అసంతృప్తితో ఉంది. ఒక మాజీ ఐపీఎస్ అధికారిగా చట్టబద్ధమైన హక్కుల కోసం పోరాడటానికి, రాజకీయ ప్రయోజనాల కోసం మారే వైఖరికి మధ్య ఉన్న సన్నని గీత దాటడం వల్ల ఏబీ వెంకటేశ్వరరావు తన సొంత విశ్వసనీయతను దెబ్బతీసుకున్నారు

# గ్రేటర్ పోరులో పార్టీలు...



హైదరాబాద్, : తెలంగాణలో అధికార, ప్రతిపక్ష పార్టీలు సంస్థాగతంగా బలోపేతం కావడంపై దృష్టి పెట్టాయి. త్వరలోనే గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పార్టీలు సంస్థాగతంగా బలోపేతం కావాలని నిర్ణయించడం గమనార్హం. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు ఇదే వ్యూహంతో ముందుకు సాగుతున్నాయి. వాస్తవానికి.. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు క్షేత్రస్థాయిలో బలంగానే ఉన్నాయన్న వాదన ఉంది. బీజేపీకి మాత్రమే హైదరాబాద్ సహా.. కొన్ని జిల్లాల్లో బలం ఉన్నా.. రాష్ట్ర వ్యాప్తంగా వెనుకబడే ఉంది బీజేపీ సంస్థాగతంగా నిలదొక్కుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ముఖ్యంగా పార్టీ పెద్దలు.. వచ్చే ఎన్నికల్లో తెలంగాణను దక్కించుకునేందుకు రెడీగా ఉన్నారు. కానీ, క్షేత్రస్థాయిలో వారి అంచనాలకు అనుగుణంగా కార్యకర్తలు బలోపేతం కావడం లేదు. పార్టీ నాయకుల మధ్య కూడా సఖ్యత కనిపించడం లేదు. ఈ పరిణామాలను సరిదిద్దుకునేందుకు బీజేపీ సంస్థాగతంగా బలోపేతం కావడంపై దృష్టి పెట్టింది. ఈ మేరకు పార్టీ చీఫ్ రామచందర్‌రావు.. చర్యలు చేపట్టారు. ఇక, సంస్థాగతంగా బాగానే ఉన్న కాంగ్రెస్, బీఆర్ఎస్ లు కూడా.. ఈదిశగానే అడుగులు వేయడం ఏంట నేది చర్చకు దారితీస్తోంది. దీనికి ప్రధానంగా ఒకపార్టీపై మరో పార్టీ చేసుకుంటున్న విమర్శలు.. వేసుకుం టున్న నిందలే కారణమని అంటున్నారు పరిశీలకులు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ చేయడం లేదని, కేసీఆర్ తీసుకువచ్చిన పథకాలను కూడా నీరు గారుస్తోందని, రైతులు ఉసూరుమంటున్నారని.. బీఆర్ఎస్ పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్న విషయం తెలిసిందే. దీని నుంచి తమను కాపాడుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. ఇక, కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ప్రచారం.. ముఖ్యంగా మాజీ సీఎం, బీఆర్ఎస్ అధిపతి కేసీఆర్ కేంద్రంగా సాగుతున్న విమర్శలకు అడ్డుకట్ట వేయాలన్నది బీఆర్ఎస్ వ్యూహంగా ఉంది. ఇక, ఉమ్మడి సమస్యల విషయానికి వస్తే.. క్షేత్రస్థాయిలో చిన్నా చితకా పార్టీల ఆవిర్భావం.. వాటి వల్ల తమ ఓటు బ్యాంకు ప్రభావితమయ్యే పరిస్థితిని బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు లెక్కలు వేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ఓటు బ్యాంకును కాపాడుకునేందుకు.. క్షేత్రస్థాయి కార్యకర్తలను కాపాడుకునేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నా యి. ఈ క్రమంలోనే సంస్థాగత నిర్మాణంపై దృష్టి పెట్టాయి

# పాపం గోరంట్ల..?!



**అనంతపురం,** : పోలీస్ ఖాకీ డ్రెస్ వదిలి, ఎంపీ గిరీ అనుభవించి ఒక వెలుగు వెలిగిన హిందూపురం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ రాజకీయ జీవితం ప్రస్తుతం అత్యంత దిగువ స్థాయికి పడిపోయింది. 2019లో వైఎస్సార్సీపీ తరఫున పార్లమెంట్‌లో అడుగుపెట్టిన ఆయన, పదవీకాలంలో వివాదాలతో వార్తల్లో నిలిచారు. 2024 ఎన్నికల్లో ఆయనకు టికెట్ నిరాకరించిన పార్టీ అధిష్ఠానం, ఆ తర్వాత ఏదో పేరుకే అన్నట్లు రాష్ట్ర అధికార ప్రతినిధి పదవి కట్టబెట్టింది. అయితే, పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్లుగా.. పార్టీ తాడేపల్లి ఆఫీసు ఆవరణలో కూడా ఆయనకు పెద్దగా ప్రాధాన్యత దక్కడం లేదన్నది ఓపెన్ సీక్రెట్. ఉమ్మడి అనంతపురం జిల్లాలో గోరంట్ల మాధవ్‌కు అసలు ఒక్క నియోజకవర్గ బాధ్యత కూడా లేదు. పార్టీ హైకమాండ్ ఆయనకు జిల్లాలో ఏ అసెంబ్లీ లేదా పార్లమెంట్ ఇన్‌చార్జ్ పదవినీ అప్పగించలేదు. అధికార ప్రతినిధిగా కనీసం తాడేపల్లిలో ప్రెస్ మీట్లు పెట్టి పార్టీ వాయిస్ వినిపించే అవకాశం కూడా సక్రమంగా దక్కడం లేదనే చర్చ నడుస్తోంది. దీంతో తాను ఇంకా రాజకీయాల్లో ఉనికిలోనే ఉన్నానని ప్రపంచానికి చెప్పుకోవడానికి మాజీ ఎంపీ పడరాని పాట్లు పడుతున్నారు. జిల్లాలో ఎక్కడో ఒకచోట ధర్నా జరుగుతోందంటే చాలు.. పిలవకపోయినా వెళ్లి ప్రత్యక్షమైపోవడం ఆయనకు అలవాటుగా మారిందనే విమర్శలు ఉన్నాయి. ఇటీవల రాప్తాడు నుంచి మొదలుకుని ఉరవకొండలో విశ్వేశ్వరరెడ్డి తలపెట్టిన నిరసనల వరకు, పార్టీ ఎక్కడ రోడ్డెక్కినా మాజీ ఎంపీ హడావుడిగానే చేరుకుంటున్నారు. ధర్నాల దగ్గర పోలీసులు అడ్డుకుంటే వారితో వాగ్వాదానికి దిగడం, బలవంతపు అరెస్టులు కావడం, ఆ క్రమంలో కొత్త కొత్త కేసులు మూటగట్టుకోవడం ఆయనకు నిత్యకృత్యంగా మారింది. కేవలం మీడియా దృష్టిని ఆకర్షించడానికే ఈ రకమైన ఓవర్ ఆక్షన్ చేస్తున్నారని, ఈ హడావుడి వల్ల ఎలాంటి రాజకీయ లబ్ధి కలగపోగా పోలీసు కేసులు, కోర్టు చుట్టూ తిరగాల్సి వస్తోంది. గతంలో గౌరవప్రదమైన సీఐ ఉద్యోగాన్ని వదులుకుని రాజకీయాల్లోకి వచ్చిన గోరంట్ల మాధవ్, ఇప్పుడు ఇటు నియోజకవర్గ ఇన్‌చార్జ్ పోస్టు లేక, అటు పార్టీ అధినేత జగన్ ఆశీస్సులు దక్కక తీవ్ర రాజకీయ అనిశ్చితిని ఎదుర్కొంటున్నారు. ఆవేశంగా మాట్లాడటం, ప్రతిదానికీ హైడ్రామా సృష్టించడం తప్పితే సొంతంగా కేడర్‌ను లేదా నియోజకవర్గంలో పట్టును పెంపొందించుకోవడంలో ఆయన విఫలమయ్యారనేది సొంత పార్టీ నేతల భావన. రేపోమాపోఆయన తనను పార్టీ హైకమాండ్ వాడుకుని వదిలేసిందని.. బోరుగడ్డలాగా ధర్నా చేసినా ఆశ్చర్యం లేదన్న భావన వినిపిస్తోంది.

# ఏనుగులు జీవన వైవిధ్యానికి అవసరం



**విశాఖపట్టణం,** : ఏనుగులు కేవలం అడవులకే పరిమితం కాకుండా జీవవైవిధ్యానికి కాపలాదారులుగా, దేశ సంస్కృతి, వారసత్వానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. విశాఖపట్నంలో నిర్వహించిన ప్రపంచ ఏనుగుల దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, వన్యప్రాణుల సంరక్షణ, మానవ–ఏనుగుల సంఘర్షణ నివారణపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా ఏనుగుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టడం వల్ల, 2014 నుంచి ఏనుగుల రిజర్వుల సంఖ్య 26 నుంచి 33కు పెరిగిందని, అలాగే 150 ఏనుగుల కారిడార్లను గుర్తించి రక్షణ కల్పిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో 132 నుంచి 142 వరకు అడవి ఏనుగులు ఉన్నాయని వెల్లడించారు. పలమనేరు, పార్వతీపురం మన్యం ప్రాంతాల్లో ప్రధాన సమస్యగా మారిన మానవ–ఏనుగుల సంఘర్షణను అరికట్టేందుకు కర్ణాటక ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా కర్ణాటక నుంచి నాలుగు కుంకీ ఏనుగులను తీసుకువచ్చి ముసలివాగు వద్ద ప్రత్యేక శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, వీటి సహాయంతో 50కి పైగా ఆపరేషన్లు నిర్వహించి మానవ మరణాలను 70 శాతం వరకు తగ్గించగలిగామని స్పష్టం చేశారు. అంతేకాకుండా, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ‘హనుమాన్’ కార్యక్రమంలో భాగంగా ర్యాపిడ్ రెస్పాన్స్ వాహనాలతో పాటు ఏడు ప్రత్యేక వన్యప్రాణుల అంబులెన్స్‌లను అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. వీటి ద్వారా ఇప్పటివరకు 200కు పైగా వన్యప్రాణులను రక్షించడంతో పాటు 30కి పైగా ప్రత్యేక ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఏనుగుల సంరక్షణ అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రజలందరి భాగస్వామ్యంతో ఒక ప్రజా ఉద్యమంగా మారాలని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు.

# కేసీఆర్ అన్నం పెట్టారు



**నిజామాబాద్,** : తెలంగాణ రాజకీయాల్లో సీనియర్ నేత, బాన్సువాడ ఎమ్మెల్యే, ప్రస్తుత ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు డాక్టర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి చేసిన తాజా వ్యాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. బీఆర్ఎస్ నుంచి గెలిచిన కాంగ్రెస్ గూటికి చేరిన ఆయన, పాత స్నేహాన్ని గుర్తు చేసుకుంటూనే ప్రస్తుత ప్రభుత్వంలోని లోపాలను ఎత్తిచూపారు. కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలం మంజీరా చెక్ డ్యాం వద్ద నిర్వహించిన కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం? ఆయన మాట్లాడిన మాటలు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. పోచారం శ్రీనివాస్ రెడ్డి తన ప్రసంగంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పట్ల తనకున్న కృతజ్ఞతను బహిరంగంగానే చాటుకున్నారు. అన్నం పెట్టిన వారిని మిచిపోలేం అంటూ ఆయన చేసిన వ్యాఖ్య రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. తన నియోజకవర్గమైన బాన్సువాడలో జరిగిన అభివృద్ధి అంతా కేసీఆర్ హయాంలోనే జరిగిందన, ఆ వాస్తవాన్ని చెప్పడానికి తాను ఏ మాత్రం వెనుకబాడబోనని ఆయన స్పష్టం చేశారు. కేసీఆర్‌ను మోసం చేసి పార్టీ మారడం తనకు ఇష్టం లేదని, కానీ నియోజకవర్గంలో తలెత్తిన కొన్ని అనివార్య రాజకీయ పరిస్థితులు, ఇబ్బందులు వల్లే తాను కాంగ్రెస్‌తో చేతులు కలపాల్సి వచ్చిందని వివరించారు. తాను కేవలం నియోజకవర్గ ప్రయోజనాల కోసమే ఈ నిర్ణయం తీసుకున్నానని, ఏనాడు డబ్బులకు అమ్ముడుపోయే వ్యక్తిని కాదని ఆయన స్పష్టం చేశారు. పోచారం కాంగ్రెస్ పార్టీలోకి ఎందుకు వెళ్లాల్సి వచ్చిందనే అంశంపై క్లారిటీ ఇచ్చారు. దాదాపు రెండేళ్ల క్రితం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన ఇంటికి వచ్చి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడించారని ఆయన గుర్తు చేసుకున్నారు. అనంతరం ముఖ్యమంత్రి స్వయంగా తన నివాసానికి వచ్చి, ఆరు నెలల కాలంలో నియోజకవర్గంలో పెండింగ్ సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి జరుగుతుందనే ఏకైక ఆశతోనే తాను రేవంత్ రెడ్డికి మద్దతు ప్రకటించానని, కేవలం అభివృద్ధి కోసమే ఆనాడు తాను మూడు రంగుల జాతీయ కండువాను కప్పుకున్నానని ఆయన వెల్లడించారు. తాను పదవుల కోసమో, ఆర్థిక ప్రయోజనాల కోసమో పార్టీ మారలేదని, నియోజకవర్గ ప్రజల కోసమే ఈ అడుగులు వేశామని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి తనకు గౌరవం ఉన్నప్పటికీ, ప్రభుత్వంలోని మంత్రుల తీరుపై పోచారం తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు ఇప్పటికే నెరవేరలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మరీ ముఖ్యంగా తాను ఒక సీనియర్ ఎమ్మెల్యేగా, ప్రభుత్వం సలహాదారుగా ఉండి ఫోన్ చేసిన మంత్రులు తన కాల్స్ ఎత్తడం లేదని ఆయన బహిరంగంగా విమర్శించారు. ముఖ్యమంత్రి చెప్పినా మంత్రులు నా మాట వినడం లేదు అని ఆయన వ్యాఖ్యానించడం కాంగ్రెస్ ప్రభుత్వంలోని అంతర్గత సమన్వయ లోపాన్ని ఎత్తి చూపుతోంది. ఈ కమ్యూనికేషన్ గ్యాప్ వల్ల నియోజకవర్గంలో పనులు కుంటుపడుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మంత్రుల సహకారం లేకపోవడం, నిధుల విడుదలలో జాప్యం జరగడం వల్ల బాన్సువాడ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు సగంలోనే నిలిచిపోయాయని పోచారం తెలిపారు. గతంలో ప్రారంభమైన పనులకు బిల్లులు రాకోవడంతో కాంట్రాక్టర్లు పనులను పక్కన పెట్టేశారని, ఇది ప్రజలకు ఇబ్బందికరంగా మారిందని ఆయన వివరించారు. ఉన్నది ఉన్నట్టుగా మాట్లాడటం తన నైజామని, రాజకీయ రహస్యాలు ఏవీ తన మాటల్లో లేవని ఆయన స్పష్టం చేశారు.

# విశాఖలో ఫుడ్ బ్యాంకులు!

విశాఖపట్టణం, : విశాఖపట్నంలో పోలీసులు కమ్యూనిటీ ఫ్రిజ్‌లు ఏర్పాటు చేశారు. హంగర్ ఫ్రీ వైజాగ్ పేరుతో నగరంలో ఆగస్టు 15న ఈ ఫుడ్ బ్యాంకులు ప్రారంభిస్తున్నారు. విశాఖ నగర సీపీ శంఖబ్రతబాగ్చి ఆలోచనతో నగరంలోని ఐదుచోట్ల ఈ ఫ్రిజ్‌లు ఏర్పాటు చేశారు. హోటల్స్, కేటరింగ్ నిర్వాహకుల సాయంతో వీటిని నిర్వహిస్తారు. అలాగే ఎవరైనా ఆహారం తీసుకొచ్చి ఫ్రిజ్‌లో పెట్టొచ్చు. ఈ ఫుడ్ ఫ్రీ.. ఎవరైనా తినొచ్చు. నగరంలో ఎవరూ ఆకలితో ఉండకూడదనే లక్ష్యంతో హంగర్ ఫ్రీ వైజాగ్ పేరుతో కమ్యూనిటీ ఫ్రిజ్‌లకు శ్రీకారం చుట్టబోతున్నారు. ఈ నెల 15న నగరంలో ఐదుచోట్ల ఫ్రిజ్‌లతో ఈ ఫుడ్ బ్యాంకుల్ని ప్రారంభించబోతున్నారు. నగరంలోని హోటల్స్, కేటరింగ్ నిర్వాహకులుతో పాటుగా ఎవరైనా ప్రత్యేక సందర్భాల్లో ఫుడ్ డొనేట్ చేసేందుకు ముందుకు వచ్చేవారి సహకారంతో వీటిని నిర్వహించనున్నారు. ప్రస్తుతానికి ఐదుచోట్లు ప్రారంభిస్తున్నా.. రాబోయే రోజుల్లో నగరంలో మరికొన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఈ నెల 15న నగరంలోని రైల్వే స్టేషన్, జగదాంబ జంక్షన్, ద్వారకానగర్ బస్‌స్టేషన్, మద్దిలపాలెం, గాజువాక ప్రాంతాల్లో ప్రారంభిస్తున్నారు. ఈ ఐదుచోట్ల ప్రత్యేకంగా ఒక షెడ్ ఏర్పాటు చేసి.. అక్కడ ఓ రిఫ్రిజిరేటర్‌ను అందుబాటులో ఉంచుతారు. అక్కడ నాణ్యమైన, తాజా ఆహారాన్ని అందుబాటులో ఉంచేలా ప్లాన్ చేశారు. ప్రతిరోజూ హోటల్స్, కేటరింగ్ నిర్వాహకుల సాయంతో మూడు పూటలా ఆహారాన్ని అక్కడ ఉంచుతారు. ఆయా ప్రాంతాల్లో ఇలా ఫుడ్ బ్యాంకులకు ఆహారం అందించేవారిని గుర్తించారు. ఒకవేళ ఎవరైనా బర్త్ డే, పెళ్లిరోజు, ఇతర ముఖ్యమైన సందర్భాల్లో ఫుడ్ పంపిణీ చేయాలనుకుంటే.. ఫుడ్‌బ్యాంక్ ద్వారా అవసరమైన వారికి అందజేస్తారు. మిగిలిపోయిన, పాడైపోయిన, సగం తినేసి వదిలేసిన ఆహారాన్ని తీసుకురావద్దని బోర్డులు ఏర్పాటు చేస్తారు. ఈ ఫుడ్‌బ్యాంకులకు సంబంధించిన పర్యవేక్షణ బాధ్యతల్ని స్థానికంగా ఉండే కంట్రోల్ రూమ్ సీఐలకు సీపీ అప్పగించారు. ఒకవేళ ఎవరైనా ఫుడ్ బ్యాంకుకు ఆహారం అందజేయాలి అనుకుంటే స్థానికంగా ఉండే పోలీసుల్ని, ప్రత్యేకంగా ఒక మొబైల్ నంబర్ కేటాయించి ఫుడ్ బ్యాంకుల దగ్గర బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. నగరంలో ఆకలితో ఇబ్బందిపడేవారికి ఈ ఫుడ్ బ్యాంకులు ఎంతో ఉపయోగంగా ఉంటాయని భావిస్తున్నారు. అందుకే ఈ హంగర్ ఫ్రీ వైజాగ్ పేరుతో ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. విశాఖపట్నం సీపీ శంఖబ్రతబాగ్చి ఆలోచనపై విశాఖవాసులు ప్రశంసలు కురిపిస్తు?న్నారు.

# పెద్దిరెడ్డి మళ్లీ యాక్టివ్...

**తిరుపతి,** : మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి యాక్టివ్ అయ్యారు. తాజాగా ఆయన అనంతపురం జిల్లాలో నిర్వహించిన డీఎస్సీ–2025 వ్యతిరేక నిరసనల్లో పాల్గొనేందుకు వెళ్లారు. అయితే.. పోలీసులు ఆయనను మధ్యలోనే అడ్డుకున్నారు. ఈ పరిణామం సీమ వైసీపీలో కొంత జోష్ నింపిందన్న వాదన వినిపిస్తోంది. గత రెండు సంవత్సరాలుగా.. పార్టీ పరంగా ఉద్యమాలు చేపట్టినా.. పెద్దిరెడ్డి పెద్దగా యాక్టివ్ కాలేదు. కుటుంబంపై నమోదైన కేసులు ఆయనను ఇబ్బందికి గురి చేశాయన్న వాదన ఉంది ముఖ్యంగా భూములు, మద్యం, అటవీ భూమిని ఆక్రమించి ఇల్లు కట్టుకున్నారన్న కేసులు కూడా నమోదయ్యాయి. అయితే.. వాటిపై పార్టీ పరంగా ఆయనకు మద్దతు లభించలేదు. దీంతో పెద్దిరెడ్డి కినుక వహించారని.. పార్టీలో కూడా అన్యమనస్కంగా ఆయన ఉంటున్నారన్నది కొన్నాళ్ల కిందటే చర్చకు వచ్చింది. అయితే.. తాజాగా .. పెద్ది రెడ్డి మనసు మార్చుకున్నట్టు కనిపిస్తోంది. ఇప్పటికే రెండున్నరేళ్లు గడిచిపోవడం.. నియోజకవర్గంలో కూడా కేడర్ బలహీన పడుతుండడం, నాయకుల మధ్య సమన్వయం సమస్యగా మారుతున్న నేపథ్యంలో ఉద్యమాలకు హాజర య్యారన్న టాక్ వినిపిస్తోంది. పెద్దిరెడ్డి ఇప్పటి వరకు కేవలం ఉమ్మడి చిత్తూరు జిల్లా రాజకీయాలకు మాత్రమే పరిమితం అయ్యారు. గతంలో చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంపైనే ఎక్కువగా దృష్టి పెట్టారు. గత 2024 ఎన్నికల్లో చంద్రబాబును ఓడించాలని నిర్ణయించారు. కానీ, ఈ తరహా రాజకీయాలు పనిచేయలేదు. దీంతో గత ఎన్నికల తర్వాత నుంచి పెద్దిరెడ్డి మౌనంగా ఉండిపోయారు. ఒకవైపు మదనపల్లి ఫైల్స్ తగలబడడం, మద్యం కేసు వెంటాడడం, భూముల వ్యవహారంతో తీరికలేకుండా పోయింది. మరోవైపు మరిన్ని కేసులు నమోదవుతాయన్న బెంగ కూడా ఆయనను వెంటాడింది. ఈ పరిణామాల క్రమంలో మౌనంగా ఉన్న పెద్దిరెడ్డి.. తాజాగా యాక్టివ్ కావడం కొంత మేరకు సీమలో వైసీపీకి కలిసి వస్తుందని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. అయితే.. పూర్తిస్థాయిలో ఇది కొనసాగుతుందా? లేదా? అనేది చూడాలి. కేవలం తాడిపత్రి వరకే పెద్దిరెడ్డి రాజకీయంగా పరిమితం అవుతారా? అనేది కూడా సందేహంగా మారింది. అయితే.. ఇది కొంత మేరకు సానుకూల పరిణామాలను అందిస్తున్నదన్న సంకేతాలు కూడా ఉన్నాయి. సీమలో పెద్ది రెడ్డి వంటి సీనియర్ యాక్టివ్ కావాలని కోరుకునే వారికి మాత్రం తాజా పరిణామం కొంత మేరకు సంతృప్తిని ఇచ్చిందని అంటున్నారు.

# స్టే ఉన్నా భవనాలు కూల్చేస్తారా..?

హైదరాబాద్ : కోర్టు స్టే ఉత్తర్వులు అమలులో ఉన్నప్పటికీ ప్రైవేటు ఆస్తులను కూల్చివేయడంపై తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంలో హైదరాబాద్ డిజాస్టర్ అండ్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) కమిషనర్ ఏవీ రంగనాథ్‌పై ధిక్కరణ చర్యలను సుమోటోగా స్వీకరించింది. ఆయనకు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేస్తూ, రెండు వారాల్లోగా వివరణ ఇవ్వాలని న్యాయస్థానం ఆదేశించింది. మేడ్చల్ జిల్లా, మల్కాజిగిరి మండలంలోని వాణి కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ పరిధిలో (సర్వే నెం. 194/1, 211) కోర్టు స్టే ఉన్నప్పటికీ కూల్చివేతలు చేపట్టారన్న ఆరోపణలపై జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా కలెక్టర్, మల్కాజిగిరి, తిరుమలగిరి తహసీల్దార్లు వ్యక్తిగతంగా కోర్టుకు హాజరయ్యారు. ఈ కూల్చివేతలకు రెవెన్యూ శాఖ ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని, తమ అనుమతి లేకుండానే మేడ్చల్ జిల్లాలో హైడ్రా దాదాపు 40 కూల్చివేతలు చేపట్టిందని కలెక్టర్ న్యాయస్థానానికి నివేదించారు. దీనిపై హైడ్రా తరఫు న్యాయవాది స్పందిస్తూ, రెవెన్యూ శాఖ సూచనల మేరకే జీఎల్ఆర్ నిబంధనల ప్రకారం ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకున్నామని వివరించారు. అయితే, సరైన రికార్డులను పరిశీలించకుండా ఏకపక్షంగా కూల్చివేతలు చేపట్టడం ఆమోదయోగ్యం కాదని ధర్మాసనం స్పష్టం చేసింది. హైడ్రా పరిధిలోని అన్ని జిల్లాల కలెక్టర్లు తమ వద్ద ఉన్న కోర్టు స్టే ఉత్తర్వుల వివరాలను తక్షణమే హైడ్రాకు తెలియజేయాలని న్యాయస్థానం ఆదేశించింది.

# ఏపీలో వడివడిగా మెట్రో అడుగులు



**విజయవాడ:** దేశంలోని చాలా నగరాలల్లో మెట్రో రైలు సేవలు అందుబాటులోకి వచ్చాయి. మెట్రో సేవలు కలిగిన రాష్ట్రాల జాబితాలోకి త్వరలో ఏపీ కూడా చేరబోతోంది. ఇతర రాష్ట్రాల్లో కేవలం ఒక ఒకటి, అరా నగరాల్లోనే మెట్రో సేవలు కొనసాగుతుంటే.. ఏపీలో ఏకంగా రెండు నగరాల్లో మెట్రో సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ మేరకు ఏపీలోని విజయవాడ, విశాఖపట్నంలలో మెట్రో రైలు ప్రాజెక్టులకు సంబంధించిన డీపీఆర్ లకు కేంద్రం ఆమోద ముద్ర పడే దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఈ రెండు ప్రాజెక్టులకు సంబంధించిన ఆర్థిక మదింపును కేంద్రం ప్రారంభించింది. అంటే?ఈ ప్రాజెక్టులకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టేనని చెప్పవచ్చు. తెలుగు నేల విభజన తర్వాత విభజిత ఏపీలో తొలి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన టీడీపీ? 2015లోనే విజయవాడతో పాటుగా విశాఖలో మెట్రో సేవల కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. ఈ ప్రతిపాదనలపై నాడు ఓ మోస్తరు అడుగులు పడినా? 2019లో టీడీపీ ఓడిపోవడం, వైసీపీ అధికారంలోకి రావడంతో ఆ ప్రాజెక్టులు కాస్తా అటకెక్కేశాయి. అయితే 2024 ఎన్నికల్లో జనసేన, బీజేపీలతో కలిసిన టీడీపీ? తిరిగి అధికారం చేజిక్కించుకుంది. అంతేకాకుండా అటు కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ సర్కారు, ఇటు ఏపీలో టీడీపీ నేతృత్వంలోని కూటమి సర్కారు కొలువు దీరడంతో? సీఎం నారా చంద్రబాబునాయుడు మరోమారు మెట్రో ప్రాజుక్టుల బూజు దులిపారు. విజయవాడ, విశాఖల మెట్రో రైలు ప్రాజెక్టులకు సంబంధించి డీపీఆర్ లను రూపొందించిన కూటమి సర్కారు.. వాటిని కేంద్రం పరిశీలనకు పంపింది. ఈ ప్రతిపాదనలపై దృష్టి సారించిన కేంద్రం? ఇటీవలే ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఆర్థిక మదింపును ప్రారంభించింది. ఈ ప్రక్రియ పూర్తి కాగానే? ఈ రెండు ప్రాజెక్టులకు కేంద్రం ఆమోద ముద్ర పడనుంది. ఆ వెంటనే విజయవాడ, విశాఖల్లో మెట్రో రైలు ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ కూడా ప్రారంభం కానుంది. వెరసి అతి త్వరలోనే ఈ రెండు నగరాల్లో మెట్రో రైలు సేవలు అందుబాటులోకి రానున్నాయన్న మాట. రెండు నగరాల్లో మొత్తంగా 84.63 కిలో మీటర్ల మేర మెట్రో రైలు సేవలు అందుబాటులోకి వస్తాయి. ఇక విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టు విషయానికి వస్తే..పండిట్ నెహ్రూ బస్టాండ్ నుంచి గన్నవరం, పెనమలూరు దారా తొలి దశ మెట్రో రైలు సేవలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు బందరు రోడ్డు, ఏలూ రోడ్డు, గన్నవరం, పెనమలూరుల్లో భూసేకరణకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. నగరంలో 38.40 కిలో మీటర్ల మేర ఏర్పాటు కానున్న మెట్రో ప్రాజెక్టుకు రూ.10,118 కోట్ల నిధులు అవసరం కానున్నాయి. బస్టాండ్ నుంచి గన్నవరం, పెనమలూరుల వరకు రెండు మార్గాల్లో మెట్రో ఏర్పాటు కానుంది. విశాఖ మెట్రో విషయానికి వస్తే? నగరంలో మూడు మార్గాల్లో 46.22 కిలో మీటర్ల మేర మెట్రో రైలు ప్రాజెక్టు ఏర్పాటు కానుంది. డబుల్ డెక్కర్ మోడ్ లో ఈ వ్యవస్థ ఏర్పాటు కానుంది. మూడు మార్గాల్లో కలిపి 43 మెట్రో స్టేషన్లు ఉంటాయి. ఇందుకోసం రూ.11,498 కోట్ల నిధులు అవసరం కానున్నట్లుగా డీపీఆర్ లో పేర్కొన్నారు. ఇక ఈ మెట్రో స్టీల్ ప్లాంట్, గాజువాక, ఎన్ఏడీ, తాటిచెట్లపాలెం, గురుద్వారా, మద్దిలపాలెం, హనుమంతువాకల్లో ఇంటిగ్రేటెడ్ మెట్రో స్టేషన్లు ఏర్పాటు కానుండగా? కొమ్మాది వరకూ మెట్రో ఏర్పాటు కానుంది. రెండు ప్రాజెక్టులకు కలిపి మొత్తంగా రూ.21,616 కోట్ల మేర నిధులు అవసరం కానున్నాయి. ఈ నిధుల్లో రాష్ట్రం వాటా 20 శాతం కాగా?కేంద్రం కూడా తన వంతుగా మరో 20 శాతం నిధులను అందించనుంది. ఇక మిగిలిన 60 శాతం నిధులను ఆయా ఆర్థిక సంస్థల నుంచి రుణం రూపేణా సేకరించే దిశగా డీపీఆర్ రెడీ అయ్యింది. ఏపీలో కొనసాగుతున్న పారిశ్రామిక ప్రగతి, అమరావతి అభివృద్ధిలను పరిశీలిస్తున్న పలు ప్రైవేట్ అంతర్జాతీయ సంస్థలు మెట్రో ప్రాజెక్టులో నిధులు వెచ్చించేందుకు సిద్ధంగా ఉన్నాయి. వెరసి త్వరలోనే ఏపీలో రెండు ప్రాజెక్టులు ఒకేసారి పట్టాలెక్కనున్నాయని చెప్పవచ్చు.

# మిత్రపక్షాల మధ్య డిజిటల్ వార్




విజయవాడ, : ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న ఎన్డీఏ కూటమి తమ సోషల్ మీడియా శ్రేణులను అప్రమత్తం చేస్తూ ఉమ్మడి ప్రకటన విడుదల చేశాయి. కొద్దిరోజులుగా సోషల్ మీడియా వేదికగా టీడీపీ, జనసేన సైనికుల మధ్య సాగుతున్న పరస్పర విమర్శలు, వ్యక్తిగత దూషణలు శృతిమించి కూటమి ఐక్యతకే సవాలుగా మారిన తరుణంలో నాయకత్వం ఈ దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టింది. గొడ్డలి పార్టీ కుట్రపూరితంగా సృష్టించిన నకిలీ ఖాతాల వల్ల ఈ అంతర్గత కలహాలు నడుస్తున్నాయని, ఆ ట్రాప్‌లో పడ వద్దని కూటమి సోషల్ మీడియా కోఆర్డినేషన్ కమిటీ స్పష్టమైన ముందస్తు హెచ్చరికలు జారీ చేసింది. కొన్ని వారాలుగా సోషల్ మీడియాను గమనిస్తే.. పశ్చిమ ఏపీలోని అధికార సమన్వయం నుంచి మొదలుకొని, సినిమాలు, ఐకాన్స్, రాజకీయ ప్రాధాన్యతల వరకు టీడీపీ–జనసేన క్యాడర్ మధ్య ఘాటైన సైబర్ యుద్ధమే సాగుతోంది. సినిమాల నుంచి సీనియర్ ఎన్టీఆర్ ఆహారపు అలవాట్ల వరకూ తీవ్రస్థాయిలో ఎదురుదాడి చేసుకోవడం నిత్యకృత్యమైంది. గ్రౌండ్ లెవల్‌లో నాయకుల మధ్య సఖ్యత ఉన్నప్పటికీ, సోషల్ మీడియా డిజిటల్ స్పేస్‌లో చోటుచేసుకుంటున్న ఈ తీవ్ర స్వభావపు విమర్శలు అసలైన కార్యకర్తల మానసిక స్థైర్యాన్ని దెబ్బతీయడమే కాకుండా, ప్రత్యర్థులకు బలమైన రాజకీయ ఆయుధాన్ని అందించాయి. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని విపక్ష వైసీపీ సైబర్ వింగ్ అత్యంత వ్యూహాత్మకంగా సూడో అకౌంట్స్ నడుపుతోందని కూటమి సంయుక్త ప్రకటన ఎండగట్టింది. ఒక టీడీపీ అభిమానిలా ప్రొఫైల్ రూపొందించి పవన్ కల్యాణ్‌ను హేళన చేయడం, అలాగే జనసేన సైనికుడి ముసుగులో చంద్రబాబు లేదా లోకేష్‌లను వ్యక్తిగతంగా విమర్శించడం ద్వారా ఇరు వర్గాల అసలైన కార్యకర్తలను రెచ్చగొడుతున్న వైనాన్ని కమిటీ గుర్తించింది. ఈ డిజిటల్ ట్రాప్ వల్ల నిజమైన సైనికులు ఆవేశానికి లోనై ఒకరినొకరు కించపరుచుకుంటూ, చివరికి తమ సొంత ప్రభుత్వ విజయావకాశాలను, పథకాల ప్రచారాన్ని పక్కనబెట్టి అంతర్గత పోరులోనే శక్తిని వృధా చేసుకుంటున్నారు. రాజకీయాల్లో క్షేత్రస్థాయి ఐక్యత ఎంత ముఖ్యమో, డిజిటల్ మైండ్ స్పేస్‌లో పొత్తు ధర్మాన్ని నిలబెట్టుకోవడం కూడా అంతే కీలకం. శ్రేణుల మధ్య స్వల్ప విబేధాలు కాస్తా పార్టీల అగ్రనేతల మధ్య వైరి వర్గాలుగా రూపాంతరం చెందే ప్రమాదం ఉందని గ్రహించినందునే ఈ ఉమ్మడి ప్రకటన వెలువడింది. సంయమనం పాటించకపోతే, మిత్రపక్షాల నేతలను లక్ష్యంగా చేసుకుని విద్వేషం చిమ్మే ఏ అకౌంట్‌పైనా కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేయడం మంచి పరిణామం అనుకోవచ్చు. ఆవేశాన్ని పక్కనబెట్టి, ప్రత్యర్థుల నకిలీ వ్యూహాలను తిప్పికొడుతూ ప్రభుత్వ ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంపైనే కూటమి సోషల్ సైన్యాలు దృష్టి సారించాల్సి ఉంది.

# కూటమి సర్కార్‌కు 'కౌన్సిల్' గండం..



**విజయవాడ,** : తాడేపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన వైసీపీ శాసనసభాపక్ష సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో రాబోయే ఏపీ శాసనసభ, మండలి వర్షాకాల సమావేశాలపై పార్టీ శ్రేణులకు జగన్ దిశా నిర్దేశం చేశారు. ఈ క్రమంలో ఏపీ శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ అభ్యర్థిగా గుంటూరు జిల్లాకు చెందిన పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావును వైఎస్ జగన్ అధికారికంగా ఎంపిక చేశారు. అయితే, గత సమావేశాల మాదిరిగానే తమకు ప్రతిపక్ష హోదా ఇవ్వనందుకు నిరసనగా ఈసారి కూడా అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించాలని వైసీపీ ఎమ్మెల్యేలు నిర్ణయించుకున్నారు. కానీ, తమకు పూర్తి మెజారిటీ ఉన్న శాసనమండలి (కౌన్సిల్) సమావేశాలకు మాత్రం వైసీపీ ఎమ్మెల్సీలు అందరూ విధిగా హాజరుకావాలని పార్టీ అధిష్టానం స్పష్టం చేసింది. అసెంబ్లీకి దూరంగా ఉన్నప్పటికీ, శాసనమండలి వేదికగా అధికార చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు వైసీపీ పక్కా వ్యూహాలు రచిస్తోంది. పోయినసారి తిరుమల శ్రీవారి లడ్డు కల్తీ వ్యవహారంపై పెద్ద ఎత్తున రచ్చ చేసిన వైసీపీ, ఈసారి నిరుద్యోగుల సమస్యలను ప్రధాన అస్త్రంగా మార్చుకోనుంది. ముఖ్యంగా రాష్ట్రంలో తీవ్ర చర్చనీయాంశంగా మారిన మెగా డీఎస్సీ నోటిఫికేషన్, ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియలో జరిగినట్లు చెప్తున్న అవకతవకలు, మరియు అభ్యర్థుల ఆందోళనలను మండలిలో బలంగా వినిపించాలని వైసీపీ భావిస్తోంది. మెగా డీఎస్సీ అభ్యర్థులకు జరిగిన అన్యాయంపై కూటమి ప్రభుత్వాన్ని నిలదీయడం ద్వారా నిరుద్యోగుల పక్షాన నిలబడాలని వైఎస్ జగన్ తన ఎమ్మెల్సీలకు సూచించారు. ఆగస్టు 17 నుంచి ఏపీ శాసనసభ, మండలి సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో రాజకీయ వాతావరణం అప్పుడే వేడెక్కింది. కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో సులభంగా బిల్లులను ఆమోదింపజేసుకున్నప్పటికీ, శాసనమండలిలో మాత్రం వైసీపీకి మెజారిటీ ఉండటంతో ప్రభుత్వం ప్రవేశపెట్టే బిల్లులను అడ్డుకునే అవకాశం ఉంది. ఒకవైపు గత ప్రభుత్వ హయాంలో జరిగిన గ్రూప్–1 అక్రమాలపై సిట్ తుది నివేదికతో కూటమి సర్కార్ వైఎస్సార్సీపీని కట్టడి చేయాలని చూస్తుండగా, మరోవైపు కల్తీ లడ్డు, డీఎస్సీ వ్యవహారాలను అడ్డం పెట్టుకుని శాసనమండలి వేదికగా ప్రభుత్వాన్ని ముప్పతిప్పలు పెట్టేందుకు వైసీపీ సిద్ధమవుతోంది. దీంతో ఈ వర్షాకాల సమావేశాలలో మండలి వేదికగా ఇరుపక్షాల మధ్య తీవ్ర స్థాయిలోనే రాజకీయం నడవనుందని స్పష్టమవుతోంది.

# విజయసాయిపార్టీ లీకుల వ్యూహం ఏమిటీ



నెల్లూరు, : వైఎస్సార్‌సీపీలో ఒకప్పుడు నంబర్–2గా చక్రం తిప్పి, ఆ తర్వాత రాజకీయ సన్యాసం ప్రకటించిన మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి మళ్లీ ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారారు. వైఎస్సార్‌సీపీ అధికారం కోల్పోయిన అనంతరం తన పదవికి, పార్టీకి రాజీనామా చేసి వ్యవసాయం చేసుకుంటాను అని చెప్పిన ఆయన, ఇప్పుడు సడన్‌గా కొత్త పొలిటికల్ ఇన్నింగ్స్ ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన తొలినాళ్లలో విజయసాయిరెడ్డి బీజేపీ గూటికి చేరుతారని విస్తృత ప్రచారం జరిగింది. ఢిల్లీ స్థాయిలో ఆయనకున్న పరిచయాలు, కేంద్ర పెద్దలతో ఉన్న సంబంధాల దృష్ట్యా కమలం తీర్థం పుచ్చుకుంటారని భావించారు. అయితే, ఏపీలో టీడీపీ –బీజేపీ –జనసేన కూటమి అధికారంలో ఉంది. విజయసాయిరెడ్డిని పార్టీలోకి తీసుకుంటే టీడీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందనే భావనతో పాటు, కూటమి ధర్మాన్ని పాటించేందుకు కేంద్ర బీజేపీ నాయకత్వం ఆయన చేరికపై సుముఖత చూపలేదని సమాచారం. బీజేపీ తలకదనం లేకపోవడంతో, అలాగే ఇతర జాతీయ పార్టీల వైపు వెళ్లే అవకాశం లేకపోవడంతో ఆయనకు సొంత బాట పట్టడం తప్ప మరో ప్రత్యామ్నాయం లేకుండా పోయింది. కొన్ని రోజులుగా ఆయన తిరిగి పాతగూటికి వెళ్తారని ప్రచారం జరుగుతున్నా అది దాదాపు అసాధ్యమని అంటున్నారు. వైఎస్సార్‌సీపీలో అంతర్గతంగా పెరిగిన విభేదాలు, కోటరీతో విభేదించి బయటకు రావడం, ఆ తర్వాత ఆ పార్టీ అధినాయకత్వాన్ని ఉద్దేశించి సోషల్ మీడియా ద్వారా విమర్శనాత్మక పోస్టులు పెట్టడం వల్ల జగన్‌తో ఆయనకు గ్యాప్ పెరిగింది. ఎన్నికల ఓటమి తర్వాత జగన్ కూడా విజయసాయిరెడ్డి వ్యాఖ్యల పట్ల అసంతృప్తిగా ఉన్నారని, ఆయనను తిరిగి చేర్చుకోవడానికి జగన్ సిద్ధంగా లేరనే అభిప్రాయం వినిపించడంతో విజయసాయిరెడ్డి పూర్తిగా వైఎస్సార్‌సీపీ అధ్యాయానికి స్వస్తి చెప్పారని భావించవచ్చు.ఈ పరిణామాలతో విజయసాయిరెడ్డి భారత్ జన వికాస్ పేరుతో సరికొత్త రాజకీయ పార్టీ ఏర్పాటుకు ముహూర్తం ఖరారు చేసుకుంటున్నట్లు లీకులు బయటకు వచ్చాయి. శ్రావణ మాసం ముగిసేలోపు పార్టీ ప్రకటన ఉండే అవకాశం ఉందనే ప్రచారం సాగుతోంది. మహిళలు, రైతులు, యువత, సమగ్ర రాష్ట్రాభివృద్ధే ఎజెండాగా ప్రాంతాల వారీగా సభలు నిర్వహించాలని ఆయన యోచిస్తున్నారు. అయితే ఈ పార్టీ వెనుక మరికొందరు ముఖ్యుల ఆశీస్సులు ఉన్నాయా? లేదా ఇతర రాజకీయ శక్తులు తెరవెనుక ఉండి నడిపిస్తున్నాయా? అనే సందేహాలు కూడా రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాజకీయ క్షేత్రం ప్రస్తుతం టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి , వైఎస్సార్‌సీపీల మధ్య ముఖాముఖి పోరుగా ఉంది. ఈ బైపోలార్ పొలిటికల్ వాతావరణంలో మూడో శక్తిగా నిలబడటం లేదా సొంత పార్టీతో ప్రభావం చూపడం అత్యంత సంక్లిష్టమైన అంశం. విజయసాయిరెడ్డికి మాస్ క్యాడర్ ఆధారిత ప్రజాదరణ లేకపోవడం, కేవలం ఆర్గనైజర్ , స్ట్రాటజిస్ట్‌గా మాత్రమే గుర్తింపు ఉండటం ప్రధాన పరిమితి. ఒకవేళ పార్టీ పెట్టినా, ఆయన సాధించే ఓటింగ్ శాతం కూటమికి లాభం చేకూరుస్తుందా లేక వైఎస్సార్‌సీపీ ఓట్ బ్యాంక్‌కే గండికొడుతుందా అనేది వేచి చూడాలి. భారీ ఆర్థిక వనరులు, బలమైన క్యాడర్ లేనిదే కొత్త పార్టీ నిలదొక్కుకోవడం కష్టమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# అమరావతి నగర నిర్మాణం మొట్టమొదటి సక్సెస్

## -సీడ్ యాక్సెస్ రహదారి, స్టీల్ బ్రిడ్జిల ప్రారంభోత్సవంలో సీఎం చంద్రబాబు నాయుడు



అమరావతి : సీడ్ యాక్సెస్ రహదారి, స్టీల్ బ్రిడ్జిల ప్రారంభోత్సవం అనంతరం బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రసంగించారు. రాష్ట్రాభివృద్ధి విజన్కు అమరావతి నగర నిర్మాణం మొట్టమొదటి సక్సెస్. తెలుగు జాతి గర్వపడేలా ఉమ్మడి రాష్ట్రంలో సైబరాబాద్ నిర్మాణం జరిగింది. విభజన తర్వాత ఈ ప్రాంతం నష్ట పోయింది. రాజధాని కూడా లేకుండా పోయింది. 25 పార్లమెంటు స్థానాల్లో మధ్యలో గుంటూరు జిల్లా ఉంది. అందుకే రాజధానిని ఇక్కడ పెట్టాలని సంకల్పించాం. విస్తృత చర్చల తర్వాత మాపై విశ్వాసంతో రైతులు రాజధాని నిర్మాణం కోసం ముందుకు వచ్చారని అన్నారు. రాష్ట్ర రాజధాని కోసం భూములు త్యాగం చేసిన రైతులందరికీ పాదాభివందనం చేస్తున్నాను. సింగపూర్ అమరావతి బృహత్ ప్రణాళికకు పూర్తిగా సహకరించింది. అలాంటి సింగపూర్ను గత పాలకులు వేధింపులకు గురిచేశారు. ప్రభుత్వ కాంప్లెక్స్ భవనాలను యూనీక్గా ఉండాలని లండన్కు చెందిన నార్మన్ ఫాస్టర్స్తో డిజైన్లు చేయించాం. కొందరు గ్రాఫిక్స్ అంటూ ఎగతాళి చేశారు. ఆ గ్రాఫిక్స్ నిజం అవుతుంటే ఎగతాళి చేసిన వాళ్లంతా తల దించుకోవాలి. అమరావతితో పాటు అన్ని ప్రాంతాలకూ అభివృద్ధి వికేంద్రీకరించేలా ప్రణాళికలు చేశాం. అసెంబ్లీలో రాజధాని నిర్మాణానికి 40 వేల ఎకరాలు కావాలన్న వ్యక్తి తర్వాత మూడు రాజధానులు అని మాటతిప్పేశాడు. 2019–24 మధ్య రైతుల ఉద్యమాన్ని చరిత్ర మర్చిపోదు. ఆ ఉద్యమానికి మేం కూడా జోలె పట్టి రైతులకు సహకరించాం. అమరావతి రాజధాని నిర్మాణానికి దేశంలోని పవిత్ర నదులు, ప్రాంతాల ఆశీర్వాదం కోసం నీరు, మట్టిని తెప్పించి ఇక్కడ కలిపాం. తిరుమల తర్వాత అంతటి విశిష్టమైన శ్రీవారి ఆలయం అమరావతిలో ఉండాలని ఆకాంక్షించాను. అమరావతితో పాటు రాష్ట్రం అంతటా అభివృద్ధి కావాలన్నదే నా ఆకాంక్ష. హెల్తీ వెల్తీ హ్యాపీ ఏపీ కావాలన్నదే నా ఆకాంక్ష. అమరావతిని ఆహ్లాదకరంగా ఉండేలా తీర్చిదిద్దుతున్నామని అన్నారు.

# మహాకుంభమేళ తరహాలో గోదావరి పుష్కరాలు




**రాజమండ్రి,** : ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళా తరహాలో, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, అత్యున్నత వసతులతో 2027 గోదావరి పుష్కరాలను నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం సన్నాహాలు ముమ్మరం చేసింది. దక్షిణాది మహా కుంభమేళాగా భావించే ఈ పుష్కరాలకు కోట్ల సంఖ్యలో తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, గ్లోబల్ స్టాండర్డ్స్‌కు తగినట్లు ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మహాక్రతువు కోసం మొత్తం అంచనా వ్యయం రూ.8,500 కోట్లుగా నిర్ధారించగా.. తొలి విడత మౌలిక వసతులు, ఘాట్ల విస్తరణ పనుల నిమిత్తం ప్రభుత్వం ఇప్పటివరకు రూ.530 కోట్లను అధికారికంగా మంజూరు చేసింది. పుష్కరాల నిర్వహణలో అత్యంత కీలకమైన శాఖలకు నిధుల కేటాయింపులను ప్రభుత్వం పక్కాగా వర్గీకరించింది. గోదావరి తీరంలో భక్తుల రద్దీని తట్టుకునేలా 238 పాత , కొత్త పుష్కర ఘాట్ల ఆధునీకరణ, మరమ్మతులు, నిర్మాణాలు చేపడుతున్న నీటిపారుదల శాఖకు అత్యధికంగా రూ.210.06 కోట్లు కేటాయించారు. పట్టణ మౌలిక వసతులు, పారిశుధ్య నిర్వహణ పనుల నిమిత్తం పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు రూ.150 కోట్లు విడుదల కాగా, గోదావరి తీరమంతటా నిరంతర విద్యుత్ సరఫరా, తాత్కాలిక సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ఇంధన శాఖకు రూ.100 కోట్లు కేటాయించారు. దీంతో పాటు ఆలయాల సుందరీకరణ, ధార్మిక కార్యక్రమాల నిర్వహణకు దేవాదాయ శాఖకు రూ.60 కోట్లు, టూరిజం సేవలు, సాంస్కృతిక ప్రదర్శనల విస్తరణకు పర్యాటక, సాంస్కృతిక శాఖకు రూ.10 కోట్లు నిధులు విడుదలయ్యాయి. ఈసారి పుష్కరాలలో డిజిటల్ టెక్నాలజీ వినియోగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. లక్షలాది మంది భక్తులు ఒకేసారి వచ్చే అవకాశం ఉన్నందున క్రౌడ్ మేనేజ్‌మెంట్ కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత సీసీటీవీ నెట్‌వర్క్, డ్రోన్ సర్వైలెన్స్, రియల్ టైమ్ కంట్రోల్ రూమ్‌లను అందుబాటులోకి తేవాలని నిర్ణయించారు. భక్తులు తాము స్నానం చేయాలనుకునే ఘాట్లు, స్లాట్ బుకింగ్, ట్రాఫిక్ రూట్ మ్యాప్స్, అందుబాటులో ఉన్న పార్కింగ్ స్థలాలు, అత్యవసర వైద్య సేవల సమాచారాన్ని సులువుగా తెలుసుకునేలా ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ యాప్‌ను, క్యూఆర్ కోడ్ నేవిగేషన్ సిస్టమ్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు. నది తీరం పొడవునా పారిశుధ్యం, భద్రత , పర్యావరణ పరిరక్షణ విషయాలలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. నది నీరు కలుషితం కాకుండా ప్రత్యేక ఫిల్ట్రేషన్ గ్రిడ్లను ఏర్పాటు చేయడమే కాక, ప్లాస్టిక్ రహిత పుష్కరాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నారు. ప్రతి ఘాట్ వద్ద 24 గంటలు అందుబాటులో ఉండేలా మొబైల్ మెడికల్ టీమ్‌లు, అంబులెన్సులు, పారిశుధ్య సిబ్బంది , స్విమ్మింగ్ నిపుణులను అందుబాటులో ఉంచనున్నారు. భక్తుల రద్దీని నియంత్రించేందుకు కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్లు వేగంగా పనిచేస్తాయి. రాజమండ్రి, కోవూరు, నరసాపురం, భద్రాచలం పరిసర ప్రాంతాల గోదావరి తీరాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్ది, పుష్కరాలకు వచ్చే కోట్లాది మంది భక్తులకు భక్తిపారవశ్యంతో పాటు అధునాతనమైన, సురక్షితమైన ఆధ్యాత్మిక అనుభూతిని అందించడమే లక్ష్యంగా వైభవంగా ఏర్పాట్లు వేగవంతమవుతున్నాయి.

# మండలి కోసం వడపోతలు షురూ

విజయవాడ, : ఆంధ్రప్రదేశ్ శాసన మండలి లో గవర్నర్ కోటాకు చెందిన రెండు సభ్యుల పదవీకాలం ముగియడంతో కొత్త నియామకాలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ మొదలైంది. ఇప్పటివరకు ఈ స్థానాల్లో కొనసాగిన పందుల రవీంద్ర , జకియా ఖానం పదవీకాలం ముగియడంతో ఖాళీలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ ( ఈ రెండు స్థానాలను భర్తీ చేసే అవకాశం ఉండటంతో పలువురు నేతలు తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాల కోసం పార్టీలోనే తీవ్ర పోటీ నెలకొన్నట్లు తెలుస్తోంది. గత ఎన్నికల్లో టికెట్ దక్కని నాయకులు, పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థులు, పార్టీ కోసం త్యాగం చేసిన వారు, సామాజిక సమీకరణాల్లో కీలక పాత్ర పోషించే నేతలు తమ పేర్లను పరిశీలించాలని అధిష్ఠానాన్ని కోరుతున్నట్లు సమాచారం. సామాజిక వర్గాల సమతుల్యతను దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకునే అవకాశముందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. మిత్రపక్షాలకు ఈ స్థానాలను కేటాయించకుండా రెండింటినీ టీడీపీనే భర్తీ చేస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇప్పటికే సంకేతాలు ఇచ్చినట్లు రాజకీయ చర్చ సాగుతోంది. దీంతో పార్టీ అంతర్గతంగా పోటీ మరింత పెరిగింది. ఎవరికీ అవకాశం దక్కుతుందన్న అంశంపై నాయకుల్లో ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుతం అసెంబ్లీలో టీడీపీకి స్పష్టమైన మెజారిటీ ఉంది. దీంతో ప్రభుత్వానికి అవసరమైన బిల్లులు సులభంగా ఆమోదం పొందుతున్నాయి. అయితే శాసన మండలిలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. అక్కడ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో ప్రభుత్వానికి ప్రతి అంశంలో సవాళ్లు ఎదురవుతున్నాయి. కొన్ని కీలక బిల్లులపై మండలిలో తీవ్ర చర్చలు జరగడంతో పాటు ప్రభుత్వానికి ఆశించిన ఫలితాలు రాకపోయిన సందర్భాలు కూడా ఉన్నాయిఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొన్ని కీలక బిల్లులు శాసన మండలిలో ఆశించిన విధంగా ఆమోదం పొందలేదు. పార్టీ నేత తోట చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించే ప్రతిపాదనతో తీసుకొచ్చిన బిల్లు మండలిలో నిలిచిపోయింది. అలాగే పీపీపీ విధానంలో కొన్ని మెడికల్ కాలేజీల నిర్వహణను ప్రైవేటు సంస్థలకు అప్పగించే అంశం కూడా తీవ్ర చర్చకు దారి తీసింది. ఈ పరిణామాలు మండలిలో ప్రభుత్వ వాదనను మరింత బలంగా వినిపించే నాయకుల అవసరాన్ని టీడీపీ ముందుకు తెచ్చాయి. అందుకే సభలో దూకుడుగా వాదించే, ప్రతిపక్ష విమర్శలకు సమర్థంగా సమాధానం చెప్పగల నాయకులను ముందుకు తీసుకురావాలనే ఆలోచనకు పార్టీ ప్రాధాన్యం ఇస్తోందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఈ వ్యూహంలో భాగంగానే శ్రీకాకుళం (కు చెందిన కావలి గ్రీష్మకు అవకాశం కల్పించారు.

# రెంటికి చెడ్డ రేవడిలా ఆ 10 మంది

**హైదరాబాద్,** : రాజకీయాల్లో గోడ దూకిన పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పరిస్థితి ప్రస్తుతం ముందు నుయ్యి.. వెనుక గొయ్యి లా తయారైంది. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచి తమ నియోజకవర్గాలను డెవలప్ చేసుకుందామనో, లేక రాజకీయ భవిష్యత్తును సురక్షితం చేసుకుందామనో భావించి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న ఈ పది మంది ఎమ్మెల్యేలలో ఒక్కరంటే ఒక్కరు కూడా ప్రస్తుతం సంతోషంగా లేరనేది పొలిటికల్ వర్గాల్లో సాగుతున్న ప్రచారం. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి వంటి కొందరు నేతలు తమ ఆవేదనను బహిరంగంగానే వెళ్లగక్కుతుండగా, మిగిలిన వారు లోలోపల రగిలిపోతూ ఉక్కపోతకు గురవుతున్నారు. ఈ ఎమ్మెల్యేల ప్రస్తుత సంక్షోభానికి ప్రధాన మూలకారణం.. వీరిని కాంగ్రెస్ పార్టీ సాంకేతికంగా, చట్టబద్ధంగా, అధికారికంగా తమలో విలీనం చేసుకోలేకపోవడమే. వీరు కాంగ్రెస్‌లో చేరలేదని స్పీకర్ తీర్పిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ మా ఎమ్మెల్యేలు అయితే మా పార్టీ సమావేశాల్లో ఎందుకు పాల్గొనడం లేదని ప్రశ్నిస్తోంది. కోర్టులు, ఎన్నికల సంఘం లేదా సాంకేతిక విచారణల ముందుకు వచ్చినప్పుడు.. వేము కాంగ్రెస్‌లో చేరలేదు, కేవలం మా నియోజకవర్గాల అభివృద్ధి నిధుల కోసమే ముఖ్యమంత్రిని వినతిపత్రాలతో కలిశాం అని స్వయంగా వాంగ్మూలాలు ఇచ్చుకోవాల్సిన విచిత్రమైన, ఆత్మవంచన చేసుకునే పరిస్థితి వీరికి ఏర్పడింది. కాంగ్రెస్‌లో అనధికారికంగా చేరడం వల్ల వీరు ఒకవైపు బీఆర్ఎస్ పార్టీలో దశాబ్దాలుగా అనుభవించిన హోదా, హక్కులు, కార్యకర్తలపై ఉన్న పట్టును పూర్తిగా కోల్పోయారు. మరోవైపు, అధికారికంగా కాంగ్రెస్ ఎమ్మెల్యే అనే ముద్ర పడకపోవడంతో ప్రభుత్వ స్థాయిలో ఎలాంటి ప్రత్యేక ప్రాధాన్యతా లభించడం లేదు. ఇటు బిఆర్ఎస్‌పై హక్కు లేక, అటు కాంగ్రెస్‌లో చట్టబద్ధమైన గుర్తింపు రాక రాజకీయంగా వీరు పూర్తిగా 'రెంటికి చెడ్డ రేవడి'లా మారిపోయారనేది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. అధికార పార్టీలో చేరితే నియోజకవర్గానికి వందల కోట్ల నిధులు వస్తాయని, పనులు శరవేగంగా జరుగుతాయని ఆశించిన ఈ నేతలకు నిరాశే ఎదురవుతోంది. సొంత కాంగ్రెస్ నియోజకవర్గాలకే నిధుల కొరత వేధిస్తున్న తరుణంలో, ఈ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు ప్రాధాన్యత లభించడం లేదు. చివరకు తమ నియోజకవర్గాల చిన్న చిన్న పనుల కోసం మంత్రులను, అధికారులను కలవాలన్నా, లేదా చివరకు నిధుల కోసం ఫోన్ చేసినా అధికారులు, కాంగ్రెస్ పెద్దలు ఫోన్లు ఎత్తడం లేదని సదరు ఎమ్మెల్యేలు తమ అనుచరుల వద్ద తీవ్ర వేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పది మందిలో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి వంటి వారు పరిస్థితి తీవ్రతను ముందే గ్రహించి, మెల్లగా కాంగ్రెస్ కార్యక్రమాలకు దూరమై తిరిగి బీఆర్ఎస్ వైపు అడుగులు వేశారు. మున్సిపల్ ఎన్నికల్లో తన నియోజకవర్గంలోని ఐదు మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల్ని గెలిపించారు. కానీ, దానం నాగేందర్, పోచారం శ్రీనివాసరెడ్డి, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావ్, ప్రకాష్ గౌడ్ వంటి మిగిలిన నేతలు ఇటు వెనక్కి వెళ్లలేక, అటు ముందుకూ సాగలేక తీవ్రమైన మానసిక సంఘర్షణను అనుభవిస్తున్నారు. కాంగ్రెస్ కేడర్ కూడా వీరిని తమ సొంత నేతలుగా స్వీకరించకపోవడం, పాత కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్‌లు వీరికి వ్యతిరేకంగా గ్రూపులు కట్టడం వీరి పరిస్థితిని మరింత దారుణంగా మార్చింది. సొంత పార్టీని వీడి అధికార పక్షంలోకి వెళ్తే అన్నీ బాగుంటాయని అనుకున్న ఈ ఎమ్మెల్యేలకు ప్రస్తుత పరిణామాలు ఒక పెద్ద రాజకీయ పాఠంగా మారాయి. ప్రజామోదం పొందిన పార్టీకి దూరమై, సాంకేతిక చట్టాల చిక్కుల్లో పడి, అధికారంలో ఉన్న పార్టీ నుంచి సరైన గుర్తింపు పొందని ఈ పది మంది ఫిరాయింపు ఎమ్మెల్యేల భవిష్యత్తు ప్రస్తుతం తీవ్ర అనిశ్చితిలో పడిపోయింది.

# ఈ కేవైసీకి మరో రోజే....





**హైదరాబాద్,** : దేశవ్యాప్తంగా లిక్విడ్ పెట్రోలియం గ్యాస్ గ్యాస్ వినియోగదారులు ఈ కేవైసీ పూర్తి చేయాల్సింది. అయితే ఈ కేవైసీ పూర్తి చేయడానికి ఇప్పటి వరకు గ్యాస్ ఏజెన్సీ కి వెళ్లాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు గ్యాస్ ఏజెన్సీ కి వెళ్లాల్సిన అవసరం లేకుండా మొబైల్ ఫోన్ నుంచి ఫేస్ అథెంటికేషన్ ద్వారా ఈ-కేవైసీ చేసుకునే సదుపాయాన్ని చమురు కంపెనీలు కల్పిస్తున్నాయి. ఎల్‌పీజీ కనెక్షన్ అసలైన వినియోగదారుడిదేనా? అనే విషయాన్ని ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ ధ్రువీకరణ ద్వారా నిర్ధారించడం ఈ-కేవైసీ ఉద్దేశం. ముఖ్యంగా ఉజ్వల పథకం వంటి ప్రయోజనాలు పొందుతున్న వినియోగదారులకు ఆధార్ ఆధారిత ధ్రువీకరణ ప్రాధాన్యత కలిగి ఉంది. ప్రభుత్వం గతంలో స్పష్టం చేసిన ప్రకారం.. ఈ ప్రక్రియను డెలివరీ సిబ్బంది ద్వారా, గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ వద్ద లేదా సంబంధిత కంపెనీ మొబైల్ యాప్ ద్వారా పూర్తి చేసుకోవచ్చు. మొబైల్ ద్వారా ఈ-కేవైసీ చేయాలంటే మీ గ్యాస్ కంపెనీకి సంబంధించిన అధికారిక మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇండేన్ వినియోగదారులు 'ఇండియన్ ఆయిల్ వన్' యాప్, భారత్ గ్యాస్ వినియోగదారులు 'హలో బీపీసీఎల్', హెచ్‌పీ గ్యాస్ వినియోగదారులు 'హెచ్ పీ పే' యాప్‌ను ఉపయోగించవచ్చు. వీటితో పాటు ముఖ గుర్తింపు ద్వారా ఆధార్ ధ్రువీకరణ కోసం 'ఆధార్ ఫేస్ ఆర్ డీ' యాప్ అవసరం అవుతుంది. ఉదాహరణకు ఇండేన్ వినియోగదారులు అయితే ముందుగా 'ఇండియన్ ఆయిల్ వన్' యాప్‌ను ఫోన్‌లో డౌన్లోడ్ చేసుకోవాలి. మీ రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌తో లాగిన్ అయిన తర్వాత 'ఈ కేవైసీ' అనే ఆప్షన్‌ను ఎంచుకోవాలి. అవసరమైన వివరాలను పరిశీలించిన తర్వాత నిబంధనలకు అంగీకారం తెలిపి ఫేస్ స్కాన్ ప్రారంభించాలి. ఆ సమయంలో 'ఆధార్ ఫేస్ ఆర్ డీ' యాప్ తెరుచుకుంటుంది. స్క్రీన్‌పై కనిపించే సూచనలను పాటిస్తూ కెమెరా ముందు ముఖాన్ని చూపిస్తే ఫేస్ అథెంటికేషన్ పూర్తవుతుంది. అనంతరం ఈ-కేవైసీ అభ్యర్థనను సబ్మిట్ చేయాలి. మిగతా గ్యాస్ వినియోగదారులు కూడా ఇలాగే పూర్తి చేసుకోవచ్చు. ఫేస్ ఆథెంటికేషన్ సమయంలో మొబైల్ కెమెరా స్పష్టంగా పనిచేసేలా చూసుకోవాలి. ముఖంపై ఎక్కువగా నీడ పడకుండా తగిన వెలుతురు ఉండాలి. కెమెరా ముందు ముఖాన్ని సరిగ్గా ఉంచి స్క్రీన్‌పై కనిపించే సూచనలను పాటించాలి. ఆధార్ బయోమెట్రిక్స్ లాక్ చేసి ఉంటే ఆథెంటికేషన్‌లో సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది. అలాగే ఎల్ పీజీ కనెక్షన్‌కు సంబంధించిన మొబైల్ నంబర్, ఆధార్ వివరాలు సరిగ్గా ఉండటం కూడా ముఖ్యమే. ఈ-కేవైసీ గడువుపై ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో భిన్నమైన తేదీలు ప్రచారంలో ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో 16 ఆగస్టు 2026 తేదీలను పేర్కొంటున్నారు. అయితే దీనిపై సంబంధిత డీలర్ ను సంప్రదించడం మంచిది.

# సెలబ్రెటీలకు ఫుడ్ సేఫ్టీ వార్నింగ్

**న్యూఢిల్లీ,** : కొన్ని సంస్థలు, కంపెనీలు ప్రచారం చేసుకునేందుకు సోషల్ మీడియాను ఎందచుకుంటున్నాయి. ఇందులోని ఇన్ఫ్లుయెన్సర్స్ సైతం ఆదాయం పెంచుకునేందుకు కొన్ని ప్రత్యేక ప్రొడక్ట్స్ ను విపరీతంగా ప్రచారం చేస్తున్నాయి. చాలా మంది ఇలా వాటి గురించి తెలుసుకొని వస్తువులు, ఆహార పదార్థాలు కొనుగోలు చేస్తున్నారు. ఇలా ప్రచారం చేసేవారిని 'ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా హెచ్చరించింది. ఉత్పత్తుల గురించి పూర్తిగా తెలుసుకోకుండా ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపింది. దీని గురించి పూర్తి వివరాల్లోకి వెళితె..కొందరు సెలబ్రిటీలు, ఇన్‌ఫ్లుయెన్సర్లు ఆహార పదార్థాలు, వాటి ఆరోగ్య ప్రయోజనాల గురించి పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నారు. అయితే ఉత్పత్తుల గురించి ధ్రువీకరించని ఆరోగ్య ప్రయోజనాలను ప్రచారం చేయొద్దని స్పష్టం చేసింది. ముఖ్యంగా ఆహారపదార్థాల్లోని 'ఇమ్యూనిటీ' 'పోషకాలు అధికంగా ఉన్నాయి' వంటి వాటి గురించి నిజానిజాలను పరిశీలించాలని ఎఫ్ఎస్ఎస్ఏఐ హెచ్చరించింది. ఒక ఉత్పత్తిని ప్రమోట్ చేస్తున్నప్పుడు దాని ప్యాకేజింగ్‌పై ఉన్న వివరాలు, పోషక విలువలు, తయారీదారు చేస్తున్న ఆరోగ్య క్లెయిమ్స్ వంటి అంశాలను ఇన్‌ఫ్లుయెన్సర్లు పరిశీలించాలి. కేవలం బ్రాండ్ చెప్పిందని లేదా డబ్బులు తీసుకుని నిర్ధారణ లేని ఆరోగ్య ప్రయోజనాలను ప్రజలకు చెప్పకూడదు. ఎఫ్ఎస్ఎస్ఏఐ నిబంధనల ప్రకారం ఫుడ్‌కు సంబంధించిన క్లెయిమ్స్ నిజమైనవి, స్పష్టమైనవి, అర్థవంతమైనవి, వినియోగదారులను తప్పుదోవ పట్టించనివిగా ఉండాలి. ఒక ఆహార పదార్థం లేదా దానిలోని ఏదైనా పదార్థం ఆరోగ్యంపై సానుకూల ప్రభావం చూపుతుందని చెప్పే హెల్త్ క్లెయిమ్స్‌కు తగిన శాస్త్రీయ ఆధారాలు ఉండాలి. గతంలో కూడా ఫుడ్ ప్రొడక్టులపై తప్పుడు లేదా అతిశయోక్తి ఆరోగ్య క్లెయిమ్స్ అనుమతించబోమని స్పష్టం చేసింది. ఒక ఉత్పత్తిలో ప్రొటీన్, విటమిన్లు లేదా మరేదైనా పోషక పదార్థం ఉన్నంత మాత్రాన దాన్ని మొత్తం ఆరోగ్యకరమైన ఆహారంగా చిత్రీకరించడం సరైనది కాదు. ఇదొక్కటే 'ఆరోగ్యకరమైనది'గా చూపకుండా, సమతుల్య ఆహారం, పండ్లు, కూరగాయలు, శారీరక శ్రమ వంటి అంశాలతో కలిపి ఆహారాన్ని చూడాల్సి ఉంటుంది. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకు లక్షలాది మంది ఫాలోవర్లు ఉంటారు. వారు ఒక ఫుడ్‌ను ఇమ్యూనిటీ పెంచుతుంది.. ప్రొటీన్ లోపాన్ని తీరుస్తుంది లేదా ఆరోగ్యానికి ఎంతో మంచిది అని చెబితే, చాలామంది వినియోగదారులు దాన్ని నిపుణుల సలహాగా భావించే అవకాశం ఉంటుంది. అందుకే ఫాలోవర్లను ప్రభావితం చేసే వ్యక్తులు ఉత్పత్తి గురించి చెప్పే ప్రతి ఆరోగ్య క్లెయిమ్ విషయంలో మరింత బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

# యోగి బాటలో సువేందు



**కోల్ కత్తా,** : పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో దశాబ్దాలుగా నెలకొన్న ధోరణులను సవాలు చేస్తూ సువేందు అధికారి తన పాలనను ఆరంభించారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మలు అనుసరించిన కఠినమైన, చట్టబద్ధమైన విధానాన్ని ఆయన అనుసరిస్తున్నారని విశ్లేషకులు గమనిస్తున్నారు. అధికారంలోకి వచ్చి మూడు నెలల్లోనే పాత సమస్యలపై దృష్టి సారించడం ఈ విధానం ప్రధాన లక్షణం. యోగి ఆదిత్యనాథ్ ఉత్తరప్రదేశ్‌లో మాఫియా నెట్‌వర్క్‌లను అణచివేయడం, మహిళలపై దాడులు చేసేవారిపై కఠిన చర్యలు, అక్రమ నిర్మాణాలపై బుల్డోజర్ చర్యలు, అల్లర్ల సమయంలో రాష్ట్రాన్ని శాంతియుతంగా ఉంచడం వంటి అంశాలు గుర్తుంచుకోదగినవి. సువేందు అధికారి కూడా ఇలాంటి సమస్యలపై దృష్టి సారించారు. ఏడు దశాబ్దాలుగా పరిష్కారం కాని అంశాలను త్వరగా అందుకోవడం ఆయన పాలనలో కనిపిస్తోంది. కోల్‌కతా విమానాశ్రయం సమీపంలోని నిర్మాణం విమానాల కదలికకు అడ్డంకిగా మారిన సందర్భంలో కఠిన నిర్ణయం తీసుకోవడం ఇందుకు ఉదాహరణ. ఇలాంటి చర్యలు రాష్ట్రంలో చట్ట పాలనను బలోపేతం చేస్తాయని మద్దతుదారులు వాదిస్తున్నారు. ప్రజా ప్రదేశాల్లో మసీదులు, ఆలయాలు, చర్చిల నుంచి వచ్చే అధిక శబ్దం సుప్రీం కోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా ఉందని గుర్తించి చర్యలు తీసుకుంటున్నారు. ఉత్తరప్రదేశ్‌లో ఇలాంటి సమస్యపై యోగి ప్రభుత్వం తీసుకున్న చర్యలను అనుసరిస్తూ, అవసరమైన చోట్ల మైకుల తొలగింపు జరుగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో మదరసాలు, మసీదుల వద్ద ఏర్పడే గందరగోళాన్ని తగ్గించే ప్రయత్నం కూడా కొనసాగుతోంది. మంత్రి అగ్నిమిత్ర పాల్ త్వరలో ఫలితాలు కనిపిస్తాయని సూచించారు. ఇది మతాల మధ్య సమాన నియమాలను అమలు చేసే ప్రయత్నంగా చూడవచ్చు. ఈ చర్యలపై ముస్లిం అనుకూల పార్టీలు, కొన్ని మసీదు అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. సెక్యూలర్ ఫ్రంట్ ఎమ్మెల్యే నౌసాద్ సిద్దీఖి కుటుంబం నిర్వహించే దర్గా సంబంధిత వ్యక్తులు, కోల్‌కతాలోని నకుడా మసీదు ప్రతినిధులు మైకుల తొలగింపును వ్యతిరేకించారు. సీఎంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయినప్పటికీ ప్రభుత్వం తన విధానంపై స్థిరంగా ఉండటం గమనార్హం. ఇలాంటి వ్యతిరేకత రాజకీయ ధ్రువీకరణకు దారితీసే అవకాశం ఉంది. అయితే చట్టం ముందు అందరూ సమానమనే సూత్రాన్ని నొక్కి చెప్పడం ఈ విధానం యొక్క ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. సువేందు అధికారి పాలన ఇప్పటికే యోగి, హిమంత మాదిరిగా చట్టం, శాంతి, అభివద్ధి నినాదంపై దృష్టి సారించింది. కొన్ని నెలల్లోనే పాత సమస్యలపై చర్యలు తీసుకోవడం ప్రజల్లో ఆశను కలిగించవచ్చు. అయితే దీర్ఘకాలిక విజయం చట్ట అమలు సమానత్వం, పక్షపాత రహిత విధానం, సామాజిక సామరస్యం కాపాడటంపై ఆధారపడి ఉంటుంది. వ్యతిరేక పార్టీలు, మత సంస్థల నుంచి వచ్చే ఒత్తిడిని సమర్థవంతంగా నిర్వహించగలిగితే బెంగాల్ రాజకీయాల్లో కొత్త ధోరణి నెలకొనే అవకాశం ఉంది.

# తెలంగాణకు జనసేన ముఖ్యమంత్రి



**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో జనసేన పాత్రపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం తెలంగాణలో ఉన్న పార్టీలకు ప్రత్యామ్నాయంగా జనసేన ఎదిగే అవకాశాలు ఉన్నాయని, వచ్చే మున్సిపల్, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలని జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు సూచించారు. తెలంగాణ రాజకీయాల్లో జనసేన భవిష్యత్తుపై రాజాసింగ్ ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 2014 నుంచి తెలంగాణ రాజకీయాల్లో శూన్యత నెలకొందని, జనసేన ఆ శూన్యతను భర్తీ చేసే అవకాశాలు ఉన్నాయని రాజాసింగ్ వ్యాఖ్యానించారు తెలంగాణలో బీజేపీ, జనసేన పొత్తు ఉండదంటూ బీజేపీ రాష్ట్రశాఖ అధ్యక్షుడు రామచంద్రరావు ఇటీవల ప్రకటన చేసిన నేపథ్యంలో తాజాగా రాజాసింగ్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. తెలంగాణలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు ఆదరణ ఉందని, జనసేన పార్టీకి మద్దతు పెరుగుతోందని రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా అత్యంత కీలక పరిణామానికి దారితీసే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. రాజాసింగ్ ఏ ఉద్దేశంతో ఈ వ్యాఖ్యలు చేశారనేది స్పష్టంగా తెలియకపోయినా, తెలంగాణ రాజకీయాల్లో జనసేనను ఓ వర్గం కోరుకుంటుంది అనే సంకేతాలు అందుతున్నాయని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు తెలంగాణలో జనసేన బలమైన రాజకీయ శక్తిగా ఎదగాలని తాను కోరుకుంటున్నట్లు ఎమ్మెల్యే రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్ అవుతున్నాయి. హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలతోపాటు అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థులను పోటీకి పెట్టేలా జనసేనాని ఇప్పటి నుంచే ప్రణాళికలు రచించాలని రాజాసింగ్ కోరారు. ఇదే సమయంలో ఆయన తెలంగాణ రాజకీయాల్లో క్రియాశీలంగా ఉన్న అధికార కాంగ్రెస్, ప్రతిపక్షంలోని బీఆర్ఎస్, బీజేపీపైనా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రధానంగా పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ రాష్ట్రాన్ని అప్పులు పాలు చేసిందని రాజాసింగ్ ఆరోపించారు. అదే సమయంలో బీజేపీలో పరిస్థితులు ఏమంత బాగా లేవని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇక కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వల్ల పెద్దగా ఒరిగిందేమీ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో జనసేన గట్టిగా పనిచేస్తే తెలంగాణలో అధికారంలోకి వచ్చే అవకాశం ఉందని సంచలన విశ్లేషణ చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను చూసిన జనాలు విసిగిపోయారని, బీజేపీ అంతర్గత రాజకీయాలు వల్ల అధికారంలోకి వచ్చే అవకాశం లేదని రాజాసింగ్ విశ్లేషించారు. ప్రస్తుతం ఈ అంశంపైనే ఎక్కువ చర్చ జరుగుతోందని, తన అంచనాల ప్రకారం వచ్చే ఎన్నికల్లో జనసేన ముఖ్యమంత్రి అయ్యే అవకాశాలు కూడా ఉన్నాయని రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా విస్తృత చర్చకు దారితీస్తున్నాయి. గత ఎన్నికల్లో బీజేపీ టికెట్ పై పోటీ చేసిన రాజాసింగ్ గత ఏడాది ఆ పార్టీకి రాజీనామా చేశారు. హిందుత్వవాదిగా ముద్రపడిన ఆయన తాజాగా చేసిన వ్యాఖ్యలతో జనసేనాని పవన్ కు దగ్గరయ్యే సంకేతాలిస్తున్నారని పరిశీలకులు అనుమానిస్తున్నారు.

# ఇకపై ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ల ద్వారా వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలు

**హైదరాబాద్ :** తెలంగాణలో వాహనాల ఫిట్‌నెస్ తనిఖీలను మాన్యువల్ విధానం నుంచి ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లకు మార్చేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. తొలి దశలో 15 ఏటీఎస్‌లను ఏర్పాటు చేయనున్నారు. ట్రక్కులు, బస్సులు, కార్లు, జీపులు తదితర వాహనాలను సెన్సర్ల ద్వారా పరీక్షిస్తారు. బ్రేకింగ్ సామర్థ్యం, ఇంజిన్ పనితీరు, కాలుష్య ఉద్గారాలు, ఇతర సాంకేతిక ప్రమాణాలను మెషీన్లు ఆటోమేటిక్‌గా అంచనా వేస్తాయి. ఫలితాలను కేంద్ర వాహన్ పోర్టల్‌లో నేరుగా నమోదు చేస్తారు. కాగా, ఈ ఏటీఎస్ కేంద్రాలను 37 ప్రాంతాలకు విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది. తెలంగాణలో వాహనాల రోడ్డు ఫిట్‌నెస్ పరీక్షల విధానంలో కీలక మార్పు రానుంది. ఇప్పటివరకు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణలో మాన్యువల్‌గా నిర్వహిస్తున్న ఫిట్‌నెస్ టెస్టుల స్థానంలో ఇకపై ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లు (ఏటీఎస్) అందుబాటులోకి రానున్నాయి. వాహనం రోడ్డుపై నడవడానికి సురక్షితంగా ఉందా లేదా అన్నది ప్రత్యేక సెన్సర్లు, యంత్రాల ద్వారా శాస్త్రీయంగా పరీక్షించి ధ్రువీకరణ పత్రం జారీ చేయనున్నారు. రవాణా శాఖ తొలిదశలో రాష్ట్రవ్యాప్తంగా 15 ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. వీటి ఏర్పాటుకు సంబంధించిన టెండర్ ప్రక్రియ దాదాపు పూర్తయినట్లు రవాణా శాఖ వర్గాలు వెల్లడించాయి. తొలి దశలో ఏర్పాటు చేసే కేంద్రాలను డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్, రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ కార్యాలయాల పరిధిలో రెండు క్లస్టర్లుగా ఏర్పాటు చేయనున్నారు. అనంతరం ఈ నెట్‌వర్క్‌ను మొత్తం 37 ప్రతిపాదిత ప్రాంతాలకు విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఏటీఎస్‌లో వాహనాన్ని ప్రత్యేక సెన్సర్లతో కూడిన పరికరాలపై నడిపిస్తారు. ఈ ప్రక్రియలో బ్రేకులు ఎంత సమర్థంగా పనిచేస్తున్నాయి, ఇంజిన్ పనితీరు ఎలా ఉంది, వాహనం నుంచి వెలువడుతున్న కాలుష్య ఉద్గారాలు నిర్ణీత ప్రమాణాల్లో ఉన్నాయా వంటి అంశాలను ఆటోమేటిక్‌గా పరీక్షిస్తారు. అదేవిధంగా ప్రభుత్వం నిర్దేశించిన ఇతర సాంకేతిక ప్రమాణాలను కూడా యంత్రాల ద్వారా పరిశీలిస్తారు. భారీ, మధ్యతరహా వాహనాలతో పాటు లైట్ మోటార్ వెహికల్స్ కూడా ఏటీఎస్ పరిధిలోకి రానున్నాయి. ట్రక్కులు, బస్సులు వంటి హెవీ, మీడియం వాహనాలతో పాటు కార్లు, జీపులు తదితర తేలికపాటి వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించనున్నారు. దీంతో వాహన రకం ఆధారంగా అవసరమైన సాంకేతిక ప్రమాణాలను సమగ్రంగా పరిశీలించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణలో వాహనాల ఫిట్‌నెస్ తనిఖీలు మాన్యువల్‌గా జరుగుతున్నాయి. ఈ విధానంలో కొన్నిసార్లు వాహనాన్ని పూర్తిస్థాయిలో సాంకేతికంగా పరిశీలించకుండానే పైపైనే చూసి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వాహనం నిజంగా రోడ్డు ప్రయాణానికి సురక్షితమైనదేనా అన్న అంశంపై మరింత కచ్చితమైన అంచనా

అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యం లో ఫిట్‌నెస్ పరీక్షలను ఆటోమేటిక్ చేయం ద్వారా పారదర్శకతను పెంచాలని రవాణా శాఖ భావిస్తోంది. ఏటీఎస్‌లో నిర్వహించిన పరీక్షల ఫలితాలు నేరుగా కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖకు చెందిన వాహన్ పోర్టల్‌లో అప్‌లోడ్ అవుతాయి. దీంతో పరీక్షల రికార్డులు డిజిటల్‌గా నమోదవుతాయి. వాహనం ఫిట్‌నెస్‌కు సంబంధించిన సమాచారాన్ని భవిష్యత్‌లో సులభంగా పరిశీలించే అవకాశం ఉంటుంది.

# మారనున్న కేబీఆర్ పార్కు రూపు రేఖలు

**హైదరాబాద్ :** హైదరాబాద్ ప్రజలకు మరో సూపర్ న్యూస్. నగరంలో ప్రముఖ పార్క్‌గా ప్రసిద్ధి పొందిన కేబీఆర్ పార్క్ వద్ద రూపురేఖలు పూర్తిగా మారనున్నాయి. ఈ పార్క్ వద్ద విపరీతమైన ట్రాఫిక్ రద్దీ ఉంటుంది. దీనిని తగ్గించేందుకు ప్రభుత్వం సరికొత్త ఆలోచన చేసింది. పార్క్ చుట్టూ ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌ల నిర్మాణానికి ముందడుగు వేసింది. మొత్తం 14 నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. ఏడు ప్రధాన కూడళ్ల వద్ద ఈ నిర్మాణాలు జరగనున్నాయి. మొన్నటివరకు కోర్టు కేసులు, భూసేకరణ ప్రక్రియ వల్ల కొంత జాప్యం జరగగా.. ఇప్పుడు అవన్నీ తొలగిపోయాయి. దీంతో అధికారులు ప్రక్రియను మరింత వేగవంతం చేశారు. రెండేళ్లల్లో పనులన్నీ పూర్తి చేయాలనే లక్ష్యం నిర్దేశించుకున్నారు. వాహనదారులకు ఇబ్బంది కలగకుండా పనులు త్వరతగతిన పూర్తి చేయాలని భావిస్తున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 36 నుంచి కేబీఆర్ పార్క్ రోడ్డు మధ్య నాలుగు లైన్ల ఫ్లైఓవర్ ఉంటుంది. ఇక పంజాగుట్ట నుంచి జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ వైపుకు 3 లైన్ల ఫ్లైఓవర్ నిర్మిస్తారు. ఇక మహారాజా అగ్రసేన జంక్షన్ నుంచి బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 10 వైపు 2 లైన్ల ఫ్లైఓవర్ నిర్మించనున్నారు. ఇక ఫిల్మ్ నగర్-బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12 మధ్య 2 లైన్లతో కూడిన ఫ్లైఓవర్ ప్రతిపాదించారు. అలాగే జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్-జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 45 మధ్య 2 లైన్ల ఫ్లైఓవర్ ఉంటుంది. ఇక వీటితో పాటు మొత్తం 6 అండర్‌పాస్‌లు నిర్మించనున్నారు. ఫిల్మ్ నగర్ జంక్షన్ నుంచి జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ వైపు 2 లైన్ల అండర్ పాస్, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి నుంచి ఫిల్మ్ నగర్ వైపు ఒక అండర్ పాస్, ఎల్వీ ప్రసాద్ నుంచి పంజాగుట్ట వైపు 3 లైన్ల అండర్ పాస్, రోడ్డు నెంబర్ 45 నుంచి కేబీఆర్ పార్క్ ఎంట్రన్స్ వరకు ఒక అండర్ పాస్ ఉంటుంది. దాదాపు ఈ ప్రాజెక్టులు పూర్తి చేయడానికి రూ. 1090 కోట్లు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేశారు. వీటిల్లో నిర్మాణ పనుల కోసం రూ. 699.75 కోట్లు ఖర్చు కానుండగా.. భూసేకరణ ప్రక్రియ కోసం రూ. 390 కోట్లు ఖర్చు అవుతాయని అంచనా వేస్తున్నారు.

## హాలీవుడ్‌లో ప్రియాంక చోప్రా సరికొత్త చరిత్ర....




గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా ప్రస్తుతం దర్శకధీరుడు రాజమౌళి తెరకెక్కిస్తున్న 'వారణాసి' మూవీతో చాలా ఏళ్ల తర్వాత తెలుగు ఇండస్ట్రీకి రీ ఎంట్రీ ఇవ్వనుండటం విశేషం. ఇందులో సూపర్ స్టార్ మహేష్ బాబుకు జోడీగా కనిపించబోతున్నారు. భారీ యాక్షన్ అడ్వెంచర్ చిత్రంగా రాబోతుండగా.. ఇందులో పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఈ మూవీ షూటింగ్‌లో బిజీగా ఉన్న ప్రియాంక చోప్రా.. హాలీవుడ్‌లో సరికొత్త సంచలనం సృష్టిస్తున్నారు. అంతర్జాతీయ స్థాయిలో వరుసగా భారీ అవకాశాలు దక్కించుకుంటున్న ఆమె, ఇప్పుడు మరొక క్రేజీ హాలీవుడ్ చిత్రంలో నటించేందుకు సిద్ధమయ్యారు. ఆస్కార్ అవార్డు పొందిన దిగ్గజ నటుడు రస్సెల్ క్రోతో కలిసి 'బ్లూఫైట్' అనే భారీ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ థ్రిల్లర్ సినిమాలో ప్రియాంక కీలక పాత్రలో కనిపించబోతున్నట్లు సమాచారం. ప్రెడేటర్స్' సినిమా, అలాగే ప్రపంచ ప్రసిద్ధి చెందిన 'స్ట్రేంజర్ థింగ్స్' వెబ్ సిరీస్‌ను తెరకెక్కించిన దర్శకుడు నిమ్రోడ్ అంతాల్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌ను ప్రముఖ కెనడా టొరంటో ఫిల్మ్ ఫెస్టివల్‌లో అధికారికంగా ప్రదర్శించనున్నారట. అంతేకాకుండా, ఈ ఏడాది చివర్లో ఆస్ట్రేలియాలోని గోల్డ్ కోస్ట్ సముద్ర తీర ప్రాంతంలో ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభం కానుందని టాక్. ఈ సినిమా కథ కాంగో దేశంలోని ప్రమాదకరమైన ప్రదేశంలో సాగుతుందని తెలుస్తోంది. అక్కడ ఎవరికీ తెలియని ఒక విచిత్రమైన విమానాన్ని కనుగొనడానికి వెళ్లే రహస్య మిషన్ చుట్టూ కథ నడుస్తుందట. ఈ ప్రయాణంలో ఎదురయ్యే ఊహించని ప్రమాదాలు, ఉత్కంఠభరిత ఘట్టాలలో ప్రియాంక చోప్రా పాత్ర ఎంతో కీలకంగా ఉండబోతోందని టాక్. సైన్స్ ఫిక్షన్ కథ అయినప్పటికీ, ఇందులో ప్రియాంక నటన ప్రేక్షకుల హృదయాలను హత్తుకునేలా ఉంటుందని చిత్ర నిర్మాతలు చెబుతున్నారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్టులు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి.

## వివాదాస్పద వ్యాఖ్యలపై క్లారిటీ ఇచ్చిన విశాల్



తమిళ స్టార్ హీరో విశాల్, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌పై చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఇటీవల జరిగిన ఒక కార్యక్రమంలో విశాల్ మాట్లాడుతూ, సీఎం విజయ్‌తో తనకున్న ప్రత్యేకమైన సాన్నిహిత్యాన్ని పంచుకున్నారు. తాను విజయ్ గారిని కలిసినప్పుడు ఒక ముఖ్యమంత్రిని కలుస్తున్నాననే భావన కలగలేదని విశాల్ తెలిపారు. గతంలో ఉన్న ముఖ్యమంత్రులందరినీ కలిసినప్పటికీ, ఆయన్ని మాత్రం ఎంతో ఆప్యాయంగా డార్లింగ్ అని పిలిచానని చెప్పారు. 'మార్క్ ఆంటోనీ' సినిమా టీజర్ వేడుకలో విజయ్‌కు కథ చెప్పడానికి సమయం అడిగిన విషయాన్ని గుర్తు చేయగా ఆయన చిరునవ్వు చిందించారని పేర్కొన్నారు. విజయ్ ఇక సినిమాల్లో నటించడం లేదు కాబట్టి, ఆయన కోసం రాసుకున్న ఆ కథతో తనే స్వయంగా సినిమా తీసుకుంటానని స్పష్టం చేశారు. అలాగే చిత్ర పరిశ్రమను వేధిస్తున్న రెట్టింపు పన్ను సమస్యపై ముఖ్యమంత్రి దృష్టి సారిస్తారని తాను భావిస్తున్నట్లు వెల్లడించారు. మరోవైపు రాజ్‌మోహన్ గురించి తాను చేసిన వ్యాఖ్యలను చాలామంది తప్పుగా అర్థం చేసుకున్నారని విశాల్ వివరణ ఇచ్చారు. రాజ్‌మోహన్ గారిని తక్కువ చేసి మాట్లాడలేదని, అనవసరంగా కొందరు ఇందులో కులాన్ని కూడా లాగుతున్నారని అసహనం వ్యక్తం చేశారు.

## శ్రీకాంత్ ఆసక్తికర వ్యాఖ్యలు



టాలీవుడ్ సీనియర్ నటుడు శ్రీకాంత్ ఎన్నో ఏళ్ల పాటు హీరోగా విజయవంతమైన కెరీర్‌ను కొనసాగించారు. ప్రస్తుతం ఎక్కువగా కీలక, విభిన్న పాత్రల్లో నటిస్తూ, అప్పుడప్పుడు హీరోగానూ ప్రేక్షకులను అలరిస్తున్నారు. తాజాగా ఆయన 'అబ్జెక్షన్ మై లార్డ్' వెబ్ సిరీస్‌తో ఓటీటీలోకి అడుగుపెట్టారు.

ఇటీవల జీ5లో విడుదలైన ఈ సిరీస్‌కు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. ఇదిలా ఉంటే, ప్రస్తుతం 'డ్రామా జూనియర్స్ సీజన్ 9'కు శ్రీకాంత్ జడ్జిగా వ్యవహరిస్తున్నారు. టెలివిజన్‌లోకి తన ఎంట్రీ వెనుక ఉన్న కారణాన్ని ఆయన తాజాగా వెల్లడించారు. శ్రీకాంత్ మాట్లాడుతూ.. చాలా కాలంగా నాకు టీవీ షోల నుంచి ఆఫర్లు వస్తున్నాయి. కానీ నేను వాటిని తిరస్కరిస్తూ వచ్చాను. అయితే నాగార్జున పలు టీవీ షోలకు హోస్ట్‌గా వ్యవహరించడం, అలాగే ప్రస్తుతం స్టార్ డైరెక్టర్‌గా కొనసాగుతున్న అనిల్ రావిపూడి కూడా టీవీ షోల్లో కనిపించడం చూసి.. 'నేను చేస్తే తప్పేంటి?' అని అనిపించిందని చెప్పారు. అదే సమయంలో జీ తెలుగులో ప్రసారమవుతున్న 'డ్రామా జూనియర్స్' షో నుంచి ఆఫర్ వచ్చింది. ఆ కార్యక్రమానికి అనిల్ రావిపూడి కూడా జడ్జిగా ఉన్నారు. ఆయన 'రండి సార్.. మేమంతా ఉన్నాం, చూసుకుంటాం' అంటూ ధైర్యం చెప్పడంతో నేను కూడా జడ్జిగా బాధ్యతలు స్వీకరించానని శ్రీకాంత్ వెల్లడించారు. ప్రస్తుతం ఈ షోకు శ్రీకాంత్, అనిల్ రావిపూడి, రోజా జడ్జిలుగా వ్యవహరిస్తుండగా, సుడిగాలి సుధీర్ హోస్ట్‌గా అలరిస్తున్నారు.

## కీర్తి, ప్రఖ్యాతలను సాధించే క్రమంలో స్వేచ్ఛను కోల్పోవాల్సి వస్తుంది



విజయాలు లేక కాస్త వెనకబడిన యంగ్ బ్యూటీ రాశీ ఖన్నాకు ఒక్కసారిగా బంపర్ ఆఫర్ తగిలిన విషయం తెలిసిందే. సూపర్ స్టార్ రజినీకాంత్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'ధర్మన్'లో ఆమెకు హీరోయిన్‌గా నటించే గోల్డెన్ ఛాన్స్ దక్కింది. అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో సీనియర్ నటి సిమ్రాన్ కూడా కీలక పాత్రలో కనిపించబోతున్నారు. ఇప్పటికే ఈ సినిమా ఫస్ట్ లుక్ విడుదలవుతూనే నెట్టింట భారీ హైప్ క్రియేట్ చేయగా, తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న రాశీ ఖన్నా రజినీకాంత్‌తో తనకున్న అనుబంధాన్ని, సెట్స్‌లో ఆయనతో జరిపిన ఆసక్తికర సంభాషణలను పంచుకున్నారు. ఈ సినిమాలో తన పాత్ర స్వభావం గురించి, రజినీకాంత్‌తో కలిసి పనిచేసిన అద్భుతమైన అనుభవం గురించి మాట్లాడుతూ.. ఈ చిత్రంలో తన పాత్ర కథకు భావోద్వేగపరంగా కేంద్రంగా ఉంటుందని ఆమె తెలిపారు. రజినీకాంత్ పోషిస్తున్న ధర్మన్ పాత్రను ఒక మంచి వ్యక్తిగా తీర్చిదిద్దడంలో తన పాత్ర ఎంతో ప్రాధాన్యత కలిగి ఉంటుందని స్పష్టం చేశారు. దర్శకుడు అశ్వత్ తనకు ఈ కథ చెప్పినప్పుడు వెంటనే బాగా నచ్చేసిందని, కథలో ఎంతో హృదయపూర్వకమైన ఎమోషన్ ఉందని రాశీ ఖన్నా చెప్పారు. దానికితోడు రజినీకాంత్ వంటి లెజెండరీ నటుడితో కలిసి స్క్రీన్ షేర్ చేసుకునే అవకాశం రావడంతో తాను ఎంతో సంతోషంగా ఓకే చెప్పినట్లు పేర్కొన్నారు. రజినీకాంత్ సెట్స్‌లో చూపించే వినయం, కొత్త విషయాలు నేర్చుకోవాలనే ఆసక్తి తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని రాశీ ఖన్నా తెలిపారు.

నటులు ఒక రకంగా ఖైదీల లాంటి వారని రజినీ సర్ చెప్పిన ఒక మాట తన మనసులో బాగా నాటుకుపోయిందని ఆమె అన్నారు. కీర్తి, ప్రఖ్యాతలను సాధించే క్రమంలో నటులు తమ జీవితంలోని కొంత స్వేచ్ఛను కోల్పోవలసి వస్తుందనే విషయాన్ని ఆయన మాటల ద్వారా తెలుసుకున్నానని వివరించారు. షూటింగ్ సమయంలో తమ ఇద్దరి మధ్య ఆధ్యాత్మికత, అంతర్గత ఎదుగుదల, ప్రశాంతత ,ఆత్మజ్ఞానం గురించిన అనేక సంభాషణలు జరిగాయని చెప్పుకొచ్చారు.


## అలరించే 'హుషార్ పిట్టలు'



అన్షు, వాసవి గణేషన్ జంటగా నటించిన చిత్రం 'హుషారు పిట్టలు'. పద్మ అమ్మ, బీవీజీ స్టూడి యెస్ సమర్పణలో రుద్ర క్రాంతి పిక్చర్స్ పతాకంపై వెంకట్ యాదవ్ నిర్మించారు.

భిక్షు దర్శకుడు. ఈ చిత్రాన్ని ఏషియన్ సురేష్ ఫిలింస్ సంస్థలు ఈనెల 15న థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నాయి. ఈ చిత్రం ట్రైలర్‌ను ఈనెల 10న విడుదల చేస్తున్నారు మేకర్స్. ఈ సందర్భంగా దర్శకుడు బిక్షు మాట్లాడుతూ ,'మా సినిమాను 15న విడుదల చేస్తున్నాం. కానీ, బుక్ మై షోలో ఇప్పటి నుంచే టిక్కెట్స్ సేల్ చేస్తున్నాం. ఈ సినిమా చూసి అం దరూ మరొకరికి రికమెండ్ చేస్తారు. దర్శకుడు కావాలన్న నా డ్రీమ్ నెరవేరింది. ట్రైలర్ చూసిన తరువాత సినిమా మీద అందరి ఒపినియన్ మారిపోతుంది' అని తెలిపారు. 'ఈ సినిమా నచ్చి సపోర్ట్ చేస్తు న్నాను. తప్పకుండా ఈ సినిమా హిట్ కాబోతుందనే ఆత్మవిశ్వాసం అందరిలో కనిపిస్తుంది. సినిమా చూడగానే నాకు కూడా ఈ సినిమా విజయం సాధిస్తుందనే నమ్మకం కలిగింది.

## గ్లామర్ రోల్స్ చేయాలనే ఆసక్తితో ఆ పాత్ర చేశా



అలనాటి స్టార్ హీరోయిన్లలో ఒకరైన మీనా గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. తెలుగు, తమిళ చిత్ర పరిశ్రమల్లో అగ్ర కథానాయికగా ఎన్నో సంవత్సరాలు తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. అనేక మంది స్టార్ హీరోల సరసన నటించి తన అందం, అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ప్రస్తుతం సినిమాల సంఖ్య తగ్గించిన మీనా తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొని తన కెరీర్ ప్రారంభ రోజుల్లో ఎదురైన అనుభవాలను పంచుకున్నారు. మీనా మాట్లాడుతూ... కెరీర్ ప్రారంభంలో నాతో పోలిస్తే గ్లామర్ పాత్రలు చేసిన హీరోయిన్లకు ఎక్కువ ఆదరణ, గుర్తింపు లభించేది. అది చూసి నేనూ అలాంటి పాత్రలు చేయాలనే ఆసక్తి చూపాను. అదే సమయంలో ప్రభుదేవా హీరోగా తెరకెక్కిన ఓ సినిమాలో అవకాశం వచ్చింది. ఆ చిత్రంలో స్విమ్‌సూట్ ధరించి నటించాల్సి వచ్చింది. షూటింగ్‌కు సిద్ధమై స్విమ్‌సూట్ వేసుకున్న తర్వాత అద్దంలో నన్ను నేను చూసుకుని అసౌకర్యంగా ఫీల్ అయ్యాను. డ్రెస్సింగ్ రూమ్ నుంచి బయటకు రావడానికే చాలా సిగ్గేసింది.

ఆ దుస్తుల్లో డ్యాన్స్ చేయడం, నటించడం కూడా చాలా ఇబ్బందిగా అనిపించిందని తెలిపారు. గ్లామర్ పాత్రలు చేయాలనే ఆసక్తి ఉన్నప్పటికీ, ఆ అనుభవం తనను తీవ్ర అసౌకర్యానికి గురి చేసిందని మీనా వెల్లడించారు. కెరీర్ తొలినాళ్లలో జరిగిన ఆ సంఘటన ఇప్పటికీ తనకు గుర్తుండిపోయిందని ఆమె చెప్పుకొచ్చారు.

## ఆ దర్శకుడి కోసం నేను.. జివి ప్రకాష్ నరకం అనుభవించాం

ప్రముఖ గేయ రచయిత అనంత శ్రీరామ్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొని సంగీత దర్శకుడు జివి ప్రకాష్ గురించి, అలాగే దర్శకుడు అనిల్ రావిపూడి కోసం తాము ఎదుర్కొన్న కష్టాల గురించి ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. అనంత శ్రీరామ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం జీవీ ప్రకాష్ గారి సంగీత సారథ్యంలో రూపొందుతున్న 'శ్రీ శ్రీ', 'ఇరుముడి', అలాగే అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రాలకు నేను పని చేస్తున్నాను.

అనిల్ రావిపూడి గారి సినిమా కోసం మేమిద్దరం నిజంగానే నరకం అనుభవించాం. కొంతకాలం క్రితం ఓ పాటకు సంబంధించిన ప్రమోషనల్ వీడియో కోసం మమ్మల్ని ఇసుకలో పాతిపెట్టిన విషయం తెలిసిందే. ఆ వీడియో చిత్రీకరణలో నన్ను దాదాపు గంటసేపు ఇసుకలో ఉంచారు. ఇసుక బరువు మొత్తం నా కాళ్లపై పడటంతో చాలా ఇబ్బంది పడ్డాను. అయితే అనిల్ రావిపూడి గారి కోసం ఎలాంటి కష్టం చేసినా ఆనందంగానే ఉంటుంది. ఆయన సినిమా కోసం, దాన్ని ప్రేక్షకుల్లోకి తీసుకెళ్లేందుకు చేసే ప్రమోషన్ విధానం అద్భుతంగా ఉంటుంది. అందుకే ఆయనంటే నాకు చాలా ఇష్టం అని తెలిపారు. అంతేకాక నాకంటే జివి ప్రకాష్ గారే ఆ ప్రమోషనల్ వీడియో కోసం ఎక్కువ కష్టపడ్డారు.

నన్ను గంటసేపు మాత్రమే ఇసుకలో ఉంచితే, ఆయనను ఏకంగా మూడు గంటల పాటు ఇసుకలోనే ఉంచారు. బయటకు తీసిన తర్వాత ఆయన కాళ్లు వంగిపోయాయి. అవి మళ్లీ సాధారణ స్థితికి రావడానికి దాదాపు ఐదు నిమిషాలు పట్టింది. ఆ సినిమా ప్రమోషనల్ కంటెంట్ కోసం ఆయన కూడా ఎంతో శ్రమించారని అనంత శ్రీరామ్ చెప్పుకొచ్చారు.



Edited, Printed, Published & Owned by PUSALA SRINIVAS, Printed at D.K. Publications,2-3-691/1/A CPL Main Road, Amberpet, Hyderabad and Published # Do.No. 2-2-1075/20/E/1, Opp. Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13. Editor : PUSALA SRINIVAS, RNI. NO. APTEL/2008/26737. Cell: 9603754136, 9949653944 E-mail: dkchaatimpu80@gmail.com